సహజీవన భావనల పావురాయి

# గువ్వాయి

వారపత్రిక 10-11-2023 15/-









సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Email : geeturaiweekly@gmail.com

Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి 45 సంచిక: 45 హైదరాబాద్
శుక్రవారం 10 నవంబర్ 2023 రూ.15-00
25 రబీ ఉల్ ఆఖిర్ 1445 హి|జ్రీ

**తొలిగీటు**

ధర్మసమ్మతమైన (హలాల్) పనులన్నింటిలోనూ అల్లాహ్‌కు అధికంగా ఇష్టంలేని పని తలాక్ (విడాకులు) ఇవ్వడం.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




## లోపల...

| | | |
|---|---|---|
| నరకం | ...... | 04 |
| సక్సెస్ మంత్ర.... పని చేస్తూనే ఉండండి!! | ...... | 05 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)– 4 | ...... | 09 |
| ఈ వారం ఫేక్‌న్యూస్ రౌండప్ | ...... | 12 |
| మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ | ...... | 14 |
| ఆదర్శమూర్తి ముహమ్మద్ (స) (పుస్తక సమీక్ష) | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఇస్లామ్ ప్రవక్త ప్రభవించే నాటికి ప్రపంచ ఆధ్యాత్మిక, నైతిక పరిస్థితి...... | | 20 |
| కారుణ్యమూర్తి ముహమ్మద్ ప్రవక్త (స) పై కవి సమ్మేళనం | ...... | 23 |
| శాంతి సందేశం | ...... | 26 |
| పాలస్తీనా-ఇస్రాయీల్ సమస్య | ...... | 28 |
| అల్లాహ్ నామమంతో | ...... | 30 |
| చరితార్థులు–2 : నవాబ్ తఫజ్జుల్ హుస్సేన్ ఖాన్ సరత్‌జంగ్ | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| దివ్యఖుర్‌ఆన్ అధ్యయనంతో సుసమాజ నిర్మాణం సాధ్యం | ...... | 34 |

### ఏ ఎండకు ఆ గొడుగు




(భారమైన హృదయంతో భాజపాను వీడుతున్నా.
– వివేక్ వెంకటస్వామి.
ఒక పార్టీలో ప్రయారిటీ లేకపోతే
మరో పార్టీలోకి జంప్ )

భారమైన మనసుతో
రాజీనామా చేస్తున్నం
బీఆర్ఎస్ ఓటమినే
లక్ష్యంగ స్వీకరిస్తున్నం!
భాజపాపై కోపంలేదు
కాంగ్రెస్‌పై ప్రేమలేదు
మా స్వార్థం మాకుంది
విలువలతో పనిలేదు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## నరకం

**మన సమాజం** ఏ స్థాయికి దిగజారిందో చెప్పే వీడియో ఒకటి ఇటీవల బయటకు వచ్చింది. ఈ సంఘటన జరిగింది చండీగఢ్ లో. ఒక 73 సంవత్సరాల మహిళ తన కన్నకొడుకు చేతిలో అనుభవించిన చిత్రహింసకు సంబంధించిన వీడియో ఇది. కన్నకొడుకు, కోడలు, చివరకు మనవడు కలిసి ఆమెకు నరకం చూపించారు. నిజం చెప్పాలంటే సమాజం వృద్ధులకు నరకం చూపిస్తుంది. ఎన్డీటీవీలో వచ్చిన కథనం ప్రకారం ఆ కొడుకు ఒక న్యాయవాది.

కన్నతల్లి, 73 సంవత్సరాల వృద్ధురాలిని లాక్కుని వచ్చి, నిర్దాక్షిణ్యంగా ఆ కొడుకు కొడుతున్న వీడియో ఇది. ఒక వృద్ధమహిళపై ఎవరైనా దాడి చేస్తేనే మనసు చలించిపోతుంది. వృద్ధమహిళ తన కన్నతల్లి, ఆమెను ఆ కొడుకు అలా కొడుతున్నాడంటే, ఎలాంటి రాక్షసుడై ఉండాలి. అక్కడే ఉన్న కోడలు కూడా తమాషా చూసింది. మనవడు రాక్షసానందం పొందాడు.

ఆ వృద్ధమహిళ గదిలో ఒక సిసి టీవీ కెమెరా పెట్టారు. పెట్టింది ఆ కొడుకే. తల్లికి ఎప్పుడేమైనా అవసరమొస్తుందేమో అన్న శ్రద్ధతో పెట్టాడనుకుంటే పొరబాటు. తల్లి ఏం చేస్తుందో నిఘా పెట్టడానికి పెట్టాడు. ఒకరోజు ఆ వృద్ధమహిళ బాత్ రూములోకి వెళ్ళింది. అక్కడికి మనవడు వచ్చాడు. అక్కడి బాటిల్‌లో ఉన్న నీరు పడకపై వేశాడు. తండ్రిని పిలిచి చూడు నాయనమ్మ ఎలా పక్కపై మూత్రం పోసి తడిపేసిందో అని ఫిర్యాదు చేశాడు. కోడలు వచ్చింది, పక్క చూసి ఏదో మహాపాపం జరిగిపోయినట్లు ముఖం పెట్టింది. కొడుకు వెంటనే తల్లిని బాత్ రూము నుంచి లాక్కుని వచ్చి పడకపై కుదేసి, జుట్టుపట్టి లాగి చెంపలు పగిలేలా అనేకసార్లు కొట్టాడు. ఈ కుట్ర చేసింది మనుమడు. వంత పాడింది కోడలు.

ఒకవేళ నిజంగానే ఆ మహిళ పక్కపై మూత్రం పోసి ఉన్నా అందులో అంత మహాపరాధం ఏముంది? 73 సంవత్సరాల మహిళ ఆరోగ్యస్థితి, వయసు పరిగణనలోకి తీసుకుంటే ఇలా జరగవచ్చు. సంతానం బాధ్యత ఆమెను కనిపెట్టుకుని, ఆమెకు సపర్యలు చేయడం కాదా? ఆమె దుస్తులు మార్చి, శుభ్రం చేసి సేవలు చేయడం కాదా? పసిపిల్లలుగా ఉన్నప్పుడు ఈ పనులన్నీ సంతానం కోసం ఆమె చేయలేదా? పెరిగి పెద్దయిన తర్వాత ఆ పనులు చేయవలసిన బాధ్యత, కర్తవ్యం పిల్లలపై లేదా?

ఎంత కఠినాత్ముడైతే ఆ స్థితిలో ఉన్న తల్లిని అమానుషంగా లాక్కువచ్చి కొడతాడు. ఈ మొత్తం వ్యవహారం ఎలా బయటకు వచ్చిందంటే, తల్లిని చూడడానికి వచ్చిన కూతురితో ఆమె తనను రోజు కొడుకు కోడలు కలిసి కొడుతున్నారని చెప్పింది. అనుమానం వచ్చిన కూతురు ఎలాగో సిసి టీవీ ఫుటేజి సంపాదించి పరిశీలిస్తే ఈ మొత్తం హింసాకాండ బయటపడింది. ఇందులో ఇలాంటి చాలా సంఘటనలున్నాయి. ఈ మూత్రం పోసి పక్క తడిపిన సాకుతో కొట్టడం అందులో ఒక్క సంఘటన మాత్రమే. ఒకసారి మనవడు ఆమెను పడక అంచుపై పడుకోబెట్టి ఆమెను క్రిందపడేలా చేశాడు. ఇలాంటి చిత్రహింసల సంఘటనల వీడియోలు అనేకం ఆమెకు దొరికాయి. ఆ వెంటనే కూతురు పోలీసు కేసు పెట్టింది

అభాగ్యురాలైన ఆ తల్లి పేరు ఆషారాణి. ఆ కొడుకు పేరు అంకుర్ వర్మ. ఇప్పుడు అతనిపై కేసు నడుస్తోంది. ఆషారాణి పంజాబులోని రూప్ నగర్లో తన కొడుకు కోడలుతో ఉంటుంది. ఆమె భర్త గుండెపోటుతో మరణించిన తర్వాతి నుంచి కొడుకు ఇంట ఉంటుంది. కొడుకు అంకుర్ వర్మ, కోడలు సుధ, మనవడు అందరూ కలిసి ఆమెను హింసించేవారు. ఈ కొడుకు ఇలాగే తండ్రి పట్ల కూడా వ్యవహరించాడని, తండ్రి మరణం కూడా అసహజమైన మరణమని తల్లి చెబుతోంది.

ఈ అంకుర్ వర్మ ఒక న్యాయవాది. బార్ అసోసియేషన్ అతని సభ్యత్వాన్ని రద్దు చేసింది. పోలీసులు ఆ వృద్ధమహిళను కాపాడి ఆసుపత్రికి చేర్చారు. అంకుర్ వర్మ భార్య, కొడుకులపై కేసు నమోదయ్యింది.

కన్నతల్లిపై రాక్షసంగా ప్రవర్తించిన ఈ కొడుకు, వృద్ధురాలైన అత్తగారిపై అమానుషంగా వ్యవహరించిన ఈ కోడలు ... వీరిద్దరు ముసలివాళ్ళు అవుతారు కదా... ఈ మనవడు... కుట్రతో తన నాయనమ్మ పడకపై నీళ్ళు పోసి మూత్రం పోసిందని తన తండ్రితో నాయనమ్మను చావబాదించిన వాడు రేపేం చేస్తాడో ఊహించడం కష్టమా? ఇదే పరిస్థితిలో ఈ అంకుర్ వర్మ, ఆయన భార్య సుధాలు తమ కొడుకు చేతుల్లో నరకం అనుభవించడం జరగదా?

### ఎలాంటి విషవలయం ఇది?

వృద్ధాశ్రమాలు కాదు మనకు కావలసింది. తల్లిదండ్రుల సేవల చేయాలన్న సంస్కారాన్ని నేర్పే సిలబసు మనకు కావాలి. తల్లిపాదాల క్రిందనే స్వర్గముందని నమ్మే సంతానం మనకు కావాలి. తండ్రిని సేవించడం సాఫల్యానికి మార్గమని విశ్వసించే సంతానం మనకు కావాలి. సంతానం ఆడపిల్ల, మగపిల్లవాడు అన్నది ముఖ్యం కాదు. ఆడపిల్లలైనా, మగపిల్లలైనా తల్లిదండ్రుల్ని ప్రేమించేవారు కావాలి.

అబ్దుల్ వాహెద్




**దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది.** అధిక ధరలు సగటు మనిషి నడ్డి విరగ్గొడుతున్నాయి. మతతత్వం వీరంగాలు వేస్తోంది. ఇలాంటి సమయంలో ప్రముఖులు దేశంలోని పరిస్థితుల గురించి మాట్లాడే బదులు యువతకు లెక్చర్లిస్తున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు ఉన్నా లేకపోయినా, ఉద్యోగాలు దొరుకుతున్నా, దొరక్కపోయినా, ఎలా పని చేయాలో లెక్చర్లిస్తున్నారు కొందరు పెద్దలు. ఉపాధి అవకాశాల గురించి ప్రశ్నలు వస్తున్నప్పుడు 2019లో ప్రధాని మోదీ కూడా యువతకు లెక్చరిచ్చారు. పకోడీలు అమ్మడం కూడా ఉపాధి అని చెప్పారు. ఇప్పుడు 2023లో ఇన్ఫోసిస్ కంపెనీ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి యువతకు లెక్చరిచ్చారు. యువత వారానికి 70 గంటలు పని చేయాలన్నారు.

ఒకసారి దేశంలో పరిస్థితులన్నీ చూస్తే చాలా మంది యువత నెలకు పాతికవేలు సంపాదించడమే కష్టంగా మారింది. ఈ సంవత్సరమే ఏప్రిల్ నెలలో జయతీ ఘోష్, సిపి చంద్రశేఖర్‌లు ఒక రిపోర్టు ప్రచురించారు. హిందూ బిజినెస్ లైన్‌లో ఈ నివేదిక వచ్చింది. స్వయం ఉపాధి రంగంలో పనిచేస్తున్న వారెవ్వరు తమకు ఇష్టమైన పని చేయడం లేదు. ఎందుకంటే వీరి వద్ద ప్రత్యామ్నాయం లేదు. దొరికిన పని చేయక తప్పదు. 2019 ఏప్రిల్ నుంచి జూన్ వరకు స్వయం ఉపాధి రంగంలో దొరికిన సంపాదన జూన్ 2022 నాటికి మరింత తగ్గి పోయింది. ఇప్పుడు కేవలం బతకడానికి చాలినంత సంపా దించుకోవడమే గగనంగా మారింది. ప్రస్తుతం తలసరి ఆదాయాన్ని చూస్తున్నాం కాని, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల రేటును, సంపాదనల రేటును పోల్చి చూస్తే సంపాదనలో పెరుగుదల చాలా తక్కువ కనిపిస్తుందని జయతి ఘోష్ తెలిపారు. కాని ఈ పెద్దలేం చెబుతున్నారంటే, సంపాదన గురించి మాట్లాడకండి, సంపాదన తగ్గిపోతున్న పరిస్థితుల గురించి మాట్లాడకండి. పని చేయడం గురించి మాత్రమే ఆలోచించండి. సరే పనిచేయడానికి రెడీ కాని పని ఎక్కడుంది? అనే ప్రశ్న కూడా అడక్కండి. అదృష్టం వల్ల పని దొరికిన వాళ్ళు పనిచేస్తూనే ఉండండి. ఈ లెక్చర్లిస్తున్న పెద్దల ఉద్దేశ్య మేమిటంటే, దేశంలో మతతత్వ రాజకీయాలు ఏ స్థాయిలో మానసిక కాలుష్యాన్ని పెంచాయంటే, దేశంలో యువత ఇప్పుడు ఆలోచించే స్థితిలో లేదని బహుశా భావిస్తూ ఉండవచ్చు. కాబట్టి పకోడీలు అమ్ముకోమని చెప్పవచ్చు, వారానికి 70 గంటలు, అంటే వారానికి ఐదు రోజులు పని చేస్తుంటే రోజుకు 14 గంటలు, వారానికి 6 రోజులు పని చేస్తుంటే రోజుకు దాదాపు 12 గంటలు, ఒకవేళ సెలవు లేకుండా వారం పొడవునా పని చేస్తుంటే రోజుకు 10 గంటలు పనిచేయాలని చెప్పారు. అంటే ఇక యువతకు కుటుంబం, భార్యాపిల్లలు, తల్లిదండ్రులు, సామాజిక జీవితం ఇవేవీ ఉండకూడదన్నమాట.

నారాయణమూర్తి గారు చెప్పిన మాటలో ప్రతిపదం గమనించదగింది. My request is that our youngsters must say, This is my country, I want to work 70 hours a week "అంటే "మన యువత" ఇది నా దేశం, నేను వారానికి 70 గంటలు పనిచేయడానికి సిద్ధం" అని చెప్పాలి. ఇప్పుడు ఈ మాటల్లో "ఇది నా దేశం" అనే పదాలను కాస్త గమనించాలి. యువత 70 గంటలు పని చేయకపోతే వాళ్ళు ఈ దేశాన్ని తమ దేశంగా భావించేవారు కాదా? ఇది నారాయణ మూర్తి గారికి కూడా వర్తిస్తుందా? వర్తిస్తుంటే ఆయన తన కంపెనీలో ఇంజనీర్లకు జీతాలు మరింత పెంచుతారా? 'ఇది నా దేశం' అనే షరతు తన మాటకు ఎందుకాయన పెట్టారు? దేశంలో ఉన్న వ్యక్తి ఎవరైనా ఈ దేశాన్ని తన దేశంగా భావిం చడం లేదా? అందరు భావిస్తున్నారనే నేను అనుకుంటున్నాను. అందరూ అలాగే అనుకుంటున్నారు. ఈ దేశం మనది. మనందరిదీ. దేశం కోసం పనిచేయడం, దేశం కోసం కష్టపడడం అందరూ కోరుతున్నారు. కాని "ఇది నా దేశం, నేను 70 గంటలు వారానికి పనిచేస్తాను" అని చెప్పడంలో లాజిక్ ఏమిటి? ఎవరి కోసం పనిచేయాలి? తన సంపాదన కోసమైతే 8 గంటలు పనిచేసి తన కుటుంబాన్ని చూసుకోవడానికి మిగిలిన సమయం వెచ్చించాలి. అలా కాకుండా "ఇది నా దేశం" అనే షరతు పెట్టి కంపెనీల కోసం రోజుకు 12 నుంచి 14 గంటలు పనిచేయ మని చెప్పడం వల్ల దేశానికి కాదు, ఆ కంపెనీకి లాభం కలుగు తుంది. ఇలా ఎవరైనా పనిచేస్తే వారికి జీతం ఎక్కువ ఇస్తారా? చాలా మందికి ఓవర్ టైము పేమెంట్లు ఎలాగూ ఉంటాయి. అవసరమున్న వారు ఓవర్ టైము పనిచేసి కష్టపడుతుంటారు. కాని దీనికి "ఇది నా దేశం" అనే షరతుకు సంబంధమేమిటి? కుటుంబ అవసరాలకు కష్టపడడం వేరు, కంపెనీ అవసరాలకు ఉద్యోగులు కష్టపడడం వేరు. కంపెనీ కోసం కష్టపడడం అంటే దేశం కోసం కష్టపడడంగా భావించాలా?

నారాయణ మూర్తి గారు యువత వారానికి 70 గంటలు పని చేయాలన్నారు. ఆయన కూడా "ఇది నా దేశం" అని భావిస్తున్నా రని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఈ దేశంలో 80 కోట్ల మంది ప్రభుత్వం ఇచ్చే ఉచిత ఆహారధాన్యాలపై ఆధారపడి బతుకు తున్నారు. నిరుపేదలుగా ఉన్నారు. ఉద్యోగాలు ఉన్న యువత 70 గంటలు పనిచేయడం ప్రారంభిస్తే ఈ పరిస్థితి మారి పోతుందా? యువత 70 గంటలు పనిచేయడం లేదు కాబట్టి ఈ పరిస్థితి వచ్చిందా? లేక దేశంలోని ఆర్థిక విధానాల వైఫల్యం వల్ల ఈ పరిస్థితి వచ్చిందా? ఈ లెక్చర్లిచ్చే పెద్దలు ఈ విషయం గురించి ఎందుకు మాట్లాడడం లేదు. దేశంలో బడా కార్పోరేట్ల ఆదాయం భారీగా పెరుగుతూ పోతోంది. సగటు జనం ఆదాయం రోజు రోజుకు అడుగంటిపోతోంది. దీనికి కారణం ఆర్థిక విధానాలు కాదా? పేదలు మరింత పేదలుగా మారు తున్నారు. కార్పోరేట్లు తీసుకున్న రుణాలు ఏ స్థాయిలో ఉన్నాయి. దాదాపు 14.5 లక్షల కోట్ల రూపాయల రుణాలు కార్పోరేట్లు తీసుకున్నారు. "ఇది మన దేశం. మనం తీసుకున్న రుణాలు నిజాయితీగా చెల్లించేద్దాం" అని కార్పోరేట్లకు ఈ పెద్దలు ఎందుకు చెప్పడం లేదు? ఎందుకంటే బ్యాంకు నుంచి రుణం తీసుకున్న పేద, మధ్యతరగతి ప్రజలు రుణం తీర్చకపోతే వారి కట్టుబట్టలు కూడా వేలానికి వస్తాయి, కాని కార్పోరేట్లకు రుణాల రద్దు సదుపాయం ఉండనే ఉంది.

తృణమూల్ కాంగ్రెసు సభ్యుడు జవాహర్ సర్కార్ ఒక ట్వీటులో ఏమన్నారంటే, ఆర్బిఐ డాటా ప్రకారం గత 9 సంవత్సరాల్లో 14.4 లక్షల కోట్ల రూపాయల రుణాలను మోడీ సర్కారు రద్దు చేసింది. గత సర్కారు 10 సంవత్సరాల్లో రద్దు చేసిన రుణం కన్నా 7 రెట్లు ఎక్కువ. మొండి రుణాలు 1.5 శాతం వరకు ఉంటాయన్నది అంతర్జాతీయంగా కూడా ఒప్పుకునే విషయం. కాని మోడీ సర్కారు హయాంలో మొండిరుణాలు 7 నుంచి 11 శాతానికి చేరుకున్నాయని ట్వీటు చేశాడు. ఈ రద్దయిన రుణాలు బడుగు, బలహీన, పేద, మధ్యతరగతి వర్గాల రుణాలు కాదన్నది కూడా గమనించాలి. ఈ వ్యవహారాల గురించి బడా పారిశ్రామికవేత్తలు ఏమంటున్నారు? దేశంలోని యువతకు లెక్చర్లిస్తున్నప్పుడు ఈ విషయాల గురించి కూడా మాట్లాడాలి కదా. ఈ వ్యవహారాలు నిజానికి దేశాభివృద్ధికి సంబంధించినవి. భారీ పారిశ్రామికవేత్తలు సమయబద్ధంగా రుణాలు చెల్లిస్తే ఆర్థిక వ్యవస్థలో నగదు ప్రవహిస్తుంది. దేశ ఆర్థికవ్యవస్థ మెరుగు పడుతుంది.

దేశంలో పరిస్థితి ఎలా ఉంది. ప్రభుత్వం ఉత్తరప్రదేశ్‌లో సబ్సిడీ రేటుపై కిలో 25 రూపాయలకు ఉల్లిపాయలు అందిస్తోంది. లక్నోలో జనం క్యూలు కట్టి కొన్న ఫోటో ఒక చోట వచ్చింది. టమాటాల కోసం కూడా క్యూలో నిలబడే పరిస్థితి ఉంది. ఇలా క్యూలో నిలబడే పరిస్థితి చాలా సందర్భాల్లో సగటు జనానికి ఉంది. ఈ సగటు జనం నిజానికి క్యూలో గడిపే గంటలు పని చేస్తున్న గంటల్లో పరిగణన పొందుతాయా? లేదా? ఉల్లిపాయల కోసం, టమాటాల కోసం క్యూలో నిలబడే పరిస్థితి ఉందంటే ప్రజల ఆర్థిక పరిస్థితి అంచనా వేయవచ్చు. ముంబయిలో 2000 రూపాయల నోట్లు మార్చుకోడానికి చాంతాడంత క్యూలో జనం నిలబడి ఉన్నారు. ఢిల్లీ రిజర్వు బ్యాంకు వద్ద కూడా ఇలాంటి క్యూ కనిపించింది. జనాన్ని క్యూలో నిలబెట్టడం ఈ ప్రభుత్వానికి బాగా వచ్చు. ఈ క్యూల్లో గంటలు గంటలు గడిపే వారికి "ఈ దేశం నాది నేను వారానికి 70 గంటలు పని చేస్తాను"

అనే లెక్చరిస్తే ఎలా ఉంటుంది? ఆసుపత్రులు మొదలు, రేషను షాపులు, బ్యాంకుల వద్ద క్యూలు దర్శనమిస్తూనే ఉంటాయి. ఈ క్యూల్లో నిలబడేవారు చిన్న ఆదాయ వర్గాల ప్రజలు. కూలీలు, తక్కువ జీతాలకు పనిచేసే ఉద్యోగులు. ఈ క్యూల గురించి ఈ పెద్దలెవరు మాట్లాడరు. ఇలా క్యూల్లో నిలబడడం వల్ల ఎన్ని పనిగంటలు నష్టపోతున్నాం? ఆ నష్టానికి పరిహారం ఎవరు చెల్లిస్తారు? ఈ విషయాల గురించి ఈ పెద్దలు లెక్చర్లివ్వరు. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గ్యాస్ సిలిండర్ ధర 2014కు ముందు ఎంత ఉండేదో, ఇప్పుడు ఎంత ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ పరిస్థితులేవైనా మీడియాలో కనిపిస్తున్నాయా?

హైదరాబాద్, ముంబయి, ఢిల్లీ ఇలా నగరాల్లో పనిచేసేవారు తమ పని ప్రదేశాలకు వెళ్ళి రావడానికి రోజుకు 2 నుంచి 3 గంటల వరకు ప్రయాణంలో గడిపే పరిస్థితి కూడా ఉంది. ఈ సమయం కూడా పనిచేస్తున్నట్లు లెక్కలోకి వస్తుందా? ముంబయి లాంటి నగరాల్లో పొద్దున్నే 4 గంటలకు లేచి పనికి పరుగెత్తవలసి ఉంటుంది. ఆదాయం అంతంత మాత్రమే. తిరిగి రాత్రికే ఇంటికి చేరుకుంటాడు. ఇలాంటి వారు రోజుకు ఎన్ని గంటలు పని చేస్తున్నట్లు లెక్కించాలి? కుటుంబాన్ని పోషంచడానికి ఒక పని కాదు, రెండేసి, మూడేసి పనులు చేసేవారున్నారు. వారానికి 70 గంటలు కాదు, అంతకన్నా ఎక్కువగా పనిచేస్తే కాని కుటుంబం గడవని వారున్నారు. అలాంటి వారికి మీరు వారానికి 70 గంటల పని లెక్చరు ఇవ్వడం కుదరదు.

భారత ప్రభుత్వం 2018లో ఎన్నికలకు ముందు కార్పోరేట్ టాక్సు తగ్గించేసింది. అప్పుడు ఈ బడా కార్పోరేటు సంస్థల అధిపతులు సాధారణ ప్రజలకు కూడా టాక్సుల భారం తగ్గించాలని ఎవ్వరు చెప్పలేదు. 2015లో నారాయణమూర్తి గారు సంపన్నులు అధిక టాక్సులు చెల్లిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగవుతుందని చెప్పారు. అధికాదాయం ఉన్న వారికి టాక్సులు పెంచాలని కూడా చెప్పారు. కాని 2018లో కార్పోరేట్ టాక్సు తగ్గించినప్పుడు దాన్ని ఆయన వ్యతిరేకించారా? మనీ కంట్రోల్ రిసెర్చ్‌లో తెలిసిందేమిటంటే, 2012లో కొత్తగా ఉద్యోగంలోకి తీసుకున్న వారికి ఒక సాఫ్ట్‌వేర్ దిగ్గజ కంపెనీలో 3.45 లక్షల రూపాయలు ఏటా చెల్లించేది. అంటే నెలకు 23 వేల రూపాయల కన్నా తక్కువ. అదే సంవత్సరం ఆ కంపెనీ సియీవో జీతం ఏటా 80 లక్షల రూపాయలు. 2022లో ఇదే కంపెనీలో ఫ్రెషర్ జీతం ఏటా 3.6 లక్షల రూపాయలయ్యింది. అంటె నెలకు 30 వేలు అయ్యింది. అదే కంపెనీ సియీవో జీతం దాదాపు 80 కోట్లు. అంటే ఈ కంపెనీల్లో సీయీవోల జీతాలు 800 శాతం కన్నా ఎక్కువ పెరిగితే, కొత్తగా ఉద్యోగాల్లోకి తీసుకుంటున్న వారి జీతం కేవలం 45 శాతం పెరిగింది.

## నమ్మినా నమ్మకపోయినా? 10

### నివాసయోగ్యమైన చోటు

మానవ విలువలను పెంచిపోషిస్తూ, ఒకరి పట్ల మర్యాద పూర్వకంగా, నమ్మకంగా, న్యాయంగా, ఒకరి హక్కులను ఒకరు గౌరవిస్తూ జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటే, ఈ ప్రపంచం అందరికీ అన్నివిధాల నివాసయోగ్యమైన స్థానంలా మారుతుంది. అలా కాకుండా ఈ విలువలను కాలరాసి జీవనాన్ని కొనసాగించాలనుకుంటే ప్రపంచమే దుర్భరంగా, నరక తుల్యంగా మారుతుంది. మురికి కూపాల్లో మనిషి జీవించటానికి ఇష్టపడడు. అలాగే ప్రపంచ వాతావరణంలో అరాచకం ప్రబలితే, మానవ ప్రపంచం మృగాలకంటే హీనంగా మారి శాంతియుత వాతావరణం మృగ్యమైపోతుంది.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

ఇప్పుడు చాలా మంది యువకులు హోం డెలివరీ పనులు చేస్తుండటం చూస్తుంటాం. లేదా సేల్స్ మ్యానులుగా ఇంటింటికి తిరిగి కష్టపడడం చూస్తుంటాం. వాళ్ళు రోజు చాలా కష్టపడుతుంటారు. పొద్దంతా పని చేస్తుంటారు. అయినా వారి ఆదాయం చాలా తక్కువ. వాళ్ళు వారానికి 70 గంటల కన్నా ఎక్కువ పనిచేస్తుంటారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, పెద్ద పెద్ద కంపెనీల సీయీవోల మాదిరిగానే ఈ చిన్న చితకా పనులు చేసుకునే వారు కూడా ఈ దేశం నాది అనుకునే పని చేస్తున్నారు. కాని వారికి గౌరవప్రద మైన జీవితం గడిపే ఆదాయం లభిస్తుందా? మాల్ లో పనిచేసే సేల్స్ గర్ల్, సేల్స్ బాయ్ జీతమెంతో అడిగి చూడండి. రోజుకు ఎన్ని గంటలు నిలబడి పనిచేస్తారో అడిగి చూడండి. సగటు జీతం నెలకు 20 వేలు ఉండడం కూడా కష్టమే.

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఒక చర్చ ఉంది. మనిషి పనిచేసే గంటలు తగ్గాలని, పని తర్వాత తన కుటుంబంతో గడపడానికి అవసరమైన సమయం లభించాలనే చర్చ చాలా దేశాల్లో మనం చూస్తాం. ఫ్రాన్సు ప్రభుత్వం పెన్షన్ చెల్లించడానికి ఉద్యోగులు ఒకట్రెండు సంవత్సరాలు ఎక్కువ పనిచేయాలంటే అక్కడి వారు ఒప్పుకోలేదు. భారీ ప్రదర్శనలు జరిగాయి. పని, కుటుంబం ఈ రెంటి మధ్య సమతుల్యం కోసం చాలా మంది మాట్లాడుతున్న కాలం ఇది. కాని మన దేశంలో ఈ చర్చ ఎప్పుడైనా విన్నామా,

భారతదేశంలో కుటుంబ పటిష్టంగా ఉందని చెబుతుంటాం? సంస్కారాల గురించి మాట్లాడుతుంటాం, కాని కుటుంబానికి సమయం కేటాయించలేక పొద్దంతా కార్ఖానాల్లో, పనిప్రదేశాల్లో అల్పాదాయం కోసం పనిచేసి రాత్రి కేవలం కాసేపు నడుం వాల్చడానికి మాత్రమే ఇంటికి చేరుకునే అనేకమంది తమ కుటుంబాలతో సమయం గడపగలుగుతున్నారా? వారానికి 70 గంటలు పనిచేయాలని చెప్పే పెద్దలు, యువత తన కుటుంబానికి ఎలా సమయం కేటాయించగలదో ఆలోచిస్తున్నారా?

ఫ్రాన్సులో చట్టం ప్రకారం ఆఫీసులో ఉన్నప్పుడే ఉద్యోగితో మాట్లాడాలి. ఆఫీసు నుంచి పని ముగించి బయటకు వెళ్ళిన తర్వాత ఆఫీసు పని గురించి ఉద్యోగిని ఫోను చేసి మాట్లాడడం కుదరదు. ఎందుకంటే అతను తన కుటుంబంతో గడిపే సమయం అది. పోర్చుగల్‌లో కూడా ఇదే పరిస్థితి. ఆఫీసు సమయం అయిపోయిన తర్వాత ఉద్యోగికి ఫోను చేయరాదు. ముసలి తల్లిదండ్రులున్న వారు ఇంటి నుంచే పనిచేసే అవకాశాలు కల్పిస్తారు. పోర్చుగల్‌లో ఉద్యోగి ఇంట బిడ్డ పుడితే ఆ బిడ్డ ఎనిమిది సంవత్సరాల వయసు వచ్చే వరకు అతను లేదా ఆమె ఇంటి నుంచే పని చేయవచ్చు. ప్రపంచంలో చాలా దేశాలు ఈ దిశగా ఆలోచిస్తున్నాయి. కాని కుటుంబ విలువల గురించి మాట్లాడే మన దేశంలో కుటుంబం తర్వాత ముందు మీరు వారానికి 70 గంటలు ఎద్దుల్లా పనిచేయండనే లెక్చర్లు వినిపిస్తున్నాయి. కుటుంబంతో గడపకుండా అత్యధిక సమయం పనిలోనే గడిపేవారు డిప్రెషన్‌కు గురవుతారనే నివేదికలు కూడా ఉన్నాయి. రెక్కాడితే కాని డొక్కాడని కుటుం బాలు దేశంలో ఎన్నో ఉన్నాయి. ఒక నివేదిక ప్రకారం భారతీ యులు ప్రపంచంలో అత్యధికంగా పనిచేస్తుంటారు. అతి తక్కువ వేతనాలకు పనిచేస్తారు. దేశంలో పేదరికం చాలా ఉంది.

దేశంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలిప్పుడు ఎక్కువయ్యాయి. పర్మనెంట్ ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి.

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత జర్మన్ నాయకులు అక్కడి పారిశ్రామికవేత్తలతో కూర్చుని దేశాన్ని ఎలా పునర్నిర్మాంచాలో అని ఆలోచించారంటే, అందరూ ఎక్కువ గంటలు పనిచేయాలని నిర్ణయించారట. ఈ మాటలు విన్నప్పుడు నిజమే కదా అనిపిస్తుంది. కాని ఇది నిజం కాదు. జర్మనీలో 1951 తర్వాతి నుంచి పని గంటలు తగ్గిపోతూ వచ్చాయి. జపానులో కూడా పనిగంటల విషయంలో పదేళ్ళ కాలంలో చాలా హెచ్చుతగ్గులు కనిపిస్తాయి. నిజానికి పనిగంటలకు ఆర్థిక ప్రగతికి సంబంధం లేదని అంటారు. ఇప్పుడు జర్మనీలో వారానికి 28 గంటలు పనిచేయడాన్ని ఆమోదించారు. పైగా ఆదాయం 4.3 శాతం పెంచారు. ఇది జర్మనీలోని బడా పారిశ్రామికవేత్తలు, కార్మికులకు మధ్య కుదిరిన ఒప్పందం. నిజానికి 1920 నుంచే యూరపులో వారానికి 48 గంటలు పనిచేయడం ఉంది.

ప్రపంచంలో ఒకవైపు పనిగంటలను తగ్గించి ఎక్కువ మందికి పని అవకాశాలు కల్పించడం, పని, కుటుంబ జీవితాల మధ్య సమతుల్యం సాధించడం గురించి చర్చలు జరుగుతుంటే, ఇక్కడి పెద్దలు వారానికి 70 గంటలు పనిచేయాలంటున్నారు. చేద్దామన్నా చాలా మందికి ఇక్కడ పనిలేదు. అధిక గంటలు పనిచేయడం వల్ల ఉత్పాదకత పెరిగినట్లు ఎక్కడా నిదర్శనాలు లేవు. ఏది ఏమైనా భారతదేశంలో చాలా మంది అత్యధిక గంటలు పనిచేస్తున్నారని తెలుస్తోంది. పనిచేసినా జీతాలు దొరకని వారు చాలా మంది ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యువత 70 గంటలు వారానికి పనిచేయాలని చెప్పడం విచిత్రం.

నారాయణ మూర్తి ఒక పెద్ద కార్పోరేటు కంపెనీ వ్యవస్థాపకుడిగా చాలా సక్సెస్‌ఫుల్. ఆయన జీవితం చాలా మందికి ప్రేరణాత్మకం. ఆయనలా సక్సెస్‌ఫుల్ కావాలనుకునే వారు చాలా మంది ఉంటారు. నారాయణ మూర్తి సాధించిన విజయాలు చిన్నవి కావు. ఆయనలా సక్సెస్ సాధించాలని చాలా మంది ఆయన్ను ఆదర్శంగా తీసుకోవడంలో తప్పు లేదు.

అమెరికాలో ప్రతి కార్పోరేటు సగటున తమ ఆదాయంలో 9 శాతం కన్నా ఎక్కువ చారిటీ కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. మనదేశంలో సగటున కార్పోరేట్ తమ ఆదాయంలో కేవలం 4 శాతం మాత్రమే చారిటీ కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. చారిటీ కోసం ఖర్చు చేయడానికి ఇష్టపడరు కాబట్టే సియస్ఆర్ చట్టం తీసుకువచ్చి కనీసం 2 శాతమైనా సమాజం కోసం ఖర్చు చేయాలని చెప్పడం జరిగింది.

మన సమాజంలో ఇప్పుడు అందరూ సక్సెస్ గురించే మాట్లాడుతున్నారు. పిల్లలు సక్సెస్ అవ్వాలని తల్లిదండ్రులు కోరుతుంటారు. యువత సక్సెస్ సాధించాలని కోరుతుంది. కాని మంచివారిగా మారాలని కోరేవారెంత మంది? సక్సెస్ కోసం యంత్రాల్లా పని చేసే మనుషులా సమాజానికి కావలసింది? దేశానికి కావలసింది యువతకు చేయడానికి పని, పనికి తగిన వేతనం, తగిన పని గంటలు, పని, వ్యక్తిగత, కుటుంబ జీవితాల్లో సమతుల్యం ఉన్న సమాజం కావాలా? లేక పని... పని... పని తప్ప మరేమీ ఆలోచించలేని పరిస్థితులు కావాలా? ప్రపంచంలో ఏ దేశంలో అయినా వారానికి 70 గంటలు పనిచేయడం జరుగుతుందా? కుటుంబంలో సంపాదించే వ్యక్తి పొద్దుట పనికి వెళ్ళి రాత్రి తిరిగి వచ్చి అలసి నిద్ర పోయే కుటుంబాల్లో పిల్లల గురించి ఆలోచించండి. ✤

అధ్యాయం -2

4

# నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

## 1. హుదైబియా ఒప్పందం

ముస్లిములు దైవ గృహం కాబాని దర్శించకుండా ఆంక్షలు విధించడమే కాక, ఇంకా అనేక చర్యలు గైకొన్నారు మక్కా నాయకులు. ప్రవక్త శ్రీ (స) మక్కా వీడి వచ్చిన తరువాత ఒక్క ముస్లిమ్ వ్యక్తి కూడా హజ్జ్ చేయలేకపోయాడు. ఆ పరిస్థితుల్లో ప్రవక్త శ్రీ (స) ఓ రాత్రి కలగన్నారు, ముస్లిములతోపాటు తాను మక్కా వెళ్లి ఉమ్రా చేస్తున్నట్లు.

ప్రవక్తల స్వప్నం నిజమయినది. వారి కొరకు అది దైవాదేశంతో సమానం. దైవ సందేశహరులు (స) తన కలను గురించి కొందరు సహచర మాన్యుల సమక్షంలో ప్రస్తావించి మక్కా వెళ్ళదలచినట్లు చెప్పారు. మహనీయ అబూ బక్ర్(ర) ప్రవక్త శ్రీ మనసు ఎరిగిన వారు. ఆయన, "దైవప్రవక్తా! ముస్లిములందరికీ తెలుపండి, మనం ఉమ్రా చేయబోతున్నాము, రాదలచిన వారు ప్రయాణ సామగ్రి, స్వారీ ఏర్పాటు చేసుకుని మనకు తెలుపమని సలహా ఇచ్చారు" అలాగే చేయడం జరిగింది.

### ప్రయాణం

ఆ సందర్భంలో పద్నాలుగు వందల సహచర మాన్యులు ఉమ్రా కొరకు సన్నద్ధులయ్యారు. వారు హజ్జ్ ఉమ్రాల వస్త్రం, ఇహ్రామ్ ధరించారు, కుర్బానీ పశువులుగా ఒంటెల్నీ తీసుకుని వాటి మెడల్లో పట్టా కూడా వేశారు, అది కుర్బానీ పశువని చూడగానే తెలిసిపోవాలని. అలా తయారయి బయలు దేరారు.

కురైష్ ప్రజలకు ప్రవక్త శ్రీ తన అనుయాయులతో బయలుదేరిన విషయం తెలిసింది, వారు ప్రవక్త వద్దకు కబురు పంపారు, "మీరు అందరూ కలిసి ఉమ్రాకు వస్తున్నట్లు తెలిసింది, కాని మేము ఈ పరాభవాన్ని ఎలా భరించగలము, కురైష్ విరోధులు, ముస్లిములు మక్కాలోకి బలవంతాన వచ్చి ఉమ్రా చేసుకు పోయారన్న సమాచారం దేశమంతటా వ్యాపించడం?"

ఇది మరో విధంగా యుద్ధ ప్రకటన! ప్రవక్త శ్రీ(స), శాంతియుతంగా ఉమ్రా చేసుకోవాలని మాత్రమే సంకల్పించారు గనక మక్కా పుణ్యపురి ఇంకా 13 మైళ్ళ దూరాన ఉందనగా హుదైబియా అనే చోట మకాం వేశారు. మక్కా తిరస్కారులు సకీఫ్ తెగ నాయకుడు ఉర్వాను తమ పక్షాన రాయబారిగా పంపి ఏ విధంగానయినా ముస్లిములు తిరిగి వెళ్ళిపోయేలా చూడమని కోరారు. అతను వచ్చి మాటల సందర్భాన, "మీ మిత్రులు నిరాయుధులు, వారు ఆయుధాలు ధరించి రాగానే మీ వారంతా మిమ్మల్ని వదలి పారిపోతారు" అని అన్నాడు. సహచర మాన్యులను ఈ మాట రోషంతో ఉడికి పోయేలా జేసింది. ఎంతో సహన మూర్తి అయిన అబూ బక్ర్ కూడా ఉద్రిక్తులయ్యారు. ఆయన ఉర్వాను ఎలుగెత్తి పిలిచి, "మూర్ఖుడా! ఏమన్నావ్, వీరు ప్రవక్త కొరకు ప్రాణాలు అర్పించే సేవకులు. దుష్టుడా! ఇది తిరస్కారుల మంద కాదు, మేము ప్రవక్తను వదలిపోతామా?" అని గద్దించారు.

ఉర్వా ఏమీ ఎరుగని వాడిలా, "ఈయనెవరూ?" అని అడిగాడు. అక్కడున్నవారు, "దైవప్రవక్త సహచరులు, మిత్రులు అబూ బక్ర్" అని సమాధానం ఇచ్చారు. అతను, "అబూబక్ర్! నీ ఉపకారం ఒకటి నా పైన ఉంది, నేటి వరకు నేను దాన్ని తీర్చలేకపోయాను. లేకపోతే నేను కూడా నీ లానే ప్రవర్తించేవాణ్ణి" అన్నాడు.

## కుశంకలు

చివరికి ఓ ఒప్పందం ఏదో విధంగా రూపొందింది, దాని షరతుల్ని ప్రవక్త శ్రీ(స) అంగీకరించినప్పటికీ ముస్లిములకు అది నచ్చ లేదు. దానివల్ల ఒనగూడ బోయే శుభాలను కనుగొనడం అందరికీ సాధ్యపడలేదు. మహనీయ ఉమర్ లాంటి మేధావి కూడా తికమకపడ్డారు. ఆయన తమాయించుకోలేక మహనీయ అబూ బక్ర్ వద్దకు వెళ్ళి, "ఇదో, ప్రప్రథమంగా ఇస్లామ్ కాంతిని పొందిన మహాశయా, నీవే ప్రవక్తశ్రీకి అతి పురాతన మిత్రుడివి, నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పు" అని ప్రశ్నల వాన కురిపించారు ఉమర్, "ప్రవక్త దైవ సందేశ హరులు కారా?"

"నిస్సందేహంగా ఆయన దైవ సందేశ హరులే" అబూ బక్ర్.

"మనం ముస్లిములము కామా?"

"నిస్సందేహంగా మనం ముస్లిములమే."

"మనకెదురుగా ఉన్న వారు బహుదైవారాధకులు కారా?"

"అందులో సందేహమేముంది?"

"అబూ బక్ర్! ఇక చెప్పు, అయితే మనం ధర్మం విషయంలో ఒదిగిపోవడం దేనికీ?"

"ఉమర్! ఆయన దైవ సందేశ హరులు, దైవాదేశాల ననుసరించే వారు. నాకు విశ్వాసముంది, దైవం తన ప్రవక్తకు తప్పక విజయం, గౌరవం అనుగ్రహిస్తాడు!"

ఈ సమాధానాలతో తృప్తి చెందక ఆయన ప్రవక్త మహనీయుల వద్దకూ వెళ్లి ఇవే ప్రశ్నలు తిరిగి అడిగారు. ఆయన కూడా అవే సమాధానాలు, అబూ బక్ర్ ఇచ్చినవే ఇచ్చారు!

అబూ బక్ర్, ప్రవక్త (స) ద్వారా పొందిన శిక్షణ వల్ల దూర దృష్టితో జరగనున్న దాన్ని గ్రహించగలిగారు!

ఆ తరువాత మహనీయ ఉమర్ (ర) చాలా కాలం వరకు తాను ప్రవక్త శ్రీ తో జరిపిన సంభాషణ పట్ల సిగ్గిల్లుతూ ఉండేవారు.

## గుహ మిత్రుని సారథ్యంలో

హుదైబియా ఒప్పందం జరిగిన పదకొండు నెలలకు అరేబియా ఉత్తరాన కొన్ని తెగలు ముస్లిములను అణచివేయాలని ప్రొగవ సాగారు. ప్రవక్త శ్రీకి సమాచారం తెలిసి మహనీయ అబూ బక్ర్ సారథ్యంలో అయిదు వందల మంది యోధుల్ని అటువైపునకు పంపారు. ఈ సేన హిజ్రీ 7వ సంవత్సరం షాబాన్ నెలలో మదీనా నుండి బయలుదేరి ఎంతో చాకచక్యంగా వైరుల్ని అణచివేసి షవ్వాల్ నెలలో తిరిగి వచ్చేసింది.

మహనీయ నిర్ధారణాగ్రేసరులు (ర) ఉత్తర అరేబియా నుంచి తిరిగి వచ్చిన వెంటనే ప్రవక్త శ్రీ (స) ఆయన్ని మదీనాకు తూర్పు ఉత్తరాన నూట యాభై మైళ్ళ దూరాన ఓ తెగ పుజారా మొదలెట్టిన సాయుధ తిరుగుబాటును అణచడానికి పంపారు. ఆయన (ర) బనూ పుజారాను తిరుగుబాటును మానుకుని ఇస్లామ్ ఆశ్రయం లోకి రావలసిందని ఆహ్వానించారు. కాని గత్ఫాన్ తెగ వారిని విరోధానికే పురి గొలుపుతూ వచ్చింది. ఫలితంగా పోరు అనివార్య మయింది. బనూ పుజారా ఎదుర్కోలేకపోయింది. రంగం నుండి పారిపోయింది. మహనీయ అబూ బక్ర్(ర) ఎందరినో ఖైదీలుగా బంధించి, ఎంతో సొమ్ము యుద్ధ ఫలంగా తీసుకు వచ్చారు.

## ఆయన (ర) విశేషం!

మహనీయ అబూ హురైరా ఉల్లేఖించారు:

ఒక సారి ప్రవక్త శ్రీ తన సహచర గణంలో అడిగారు,

"ఈవేళ మీలో రోజావ్రతం పాటించిన వారెవరు?"

సమాధానం ఒక్కటే, అబూ బక్ర్ (ర), "నేను."

"ఈవేళ మీలో జనాజాలో పాల్గొన్న వారెవరు?"

తిరిగి ఆబూ బక్ర్, "నేను."

"ఈవేళ మీలో ఓ వ్యాధి గ్రస్తుని పరామర్శించిన వారెవరు?"

" నేను." తిరిగి ఆయనే (ర)!

ప్రవక్త మహనీయులు బోధించారు, "ఏ వ్యక్తిలో ఈ సకల సద్గుణాలు ప్రోగవుతాయో అతను తప్పనిసరిగా స్వర్గ ప్రవేశం చేస్తాడు."

## 2. మక్కా విజయం

హుదైబియా ఒప్పందంలో నిర్ణయమయిన దాని ప్రకారం, మక్కా తిరస్కారులు వారి మిత్రులు, ముస్లిములు వారి మిత్రులు రాబోయే పదేళ్ల వరకు నిర్యుద్ధ సంధిని పాటించాలి. కాని ఆ ఒడంబడిక జరిగి ఇంకా రెండేళ్లు కూడా గడవక ముందే కురైష్ మిత్రులయిన బనీ బక్ర్, ముస్లిముల మిత్రులయిన బనీ ఖుజాఅ పైకి, పాత వైరం వల్ల, దాడి జరిపారు. మక్కా బహుదైవారాధకులు వారికి సహాయపడ్డారు.

## ధైర్య వచనాలు

ఖుజాఅ తెగవారు సంఖ్యాపరంగా కొద్ది మంది మాత్రమే. వారు రక్షణ కోసమని దైవ గృహం పరిధిలోకి వచ్చి శరణు పొందారు. దైవ గృహం, కాబా పవిత్ర స్థలం. అక్కడ రక్త పాతం నిషిద్ధం. కాని బనీ బక్ర్ ఇది చాలా అనువయిన అవకాశం అని భావించి దైవ గృహంలో శరణు పొందిన వారిని హత్య చేసివేశారు. ఖుజాఅ తెగ నాయకుడు అమ్ర్, మదీనాకు పరుగు పరుగున వచ్చి ప్రవక్తశ్రీతో మొర పెట్టుకున్నాడు. ఆయన, "నీవు నెమ్మదించు, మేము వీరిని దౌర్జన్యం చేసినందుకు, ఒప్పందాన్ని భంగ పరచినందుకు అనతి కాలంలోనే శిక్షించగలము" అని హామీ నిచ్చారు.

అటు కురైష్ తాము చేసిన తప్పిదానికి బాగా భయపడ సాగారు. ముస్లిములు తమ ఒప్పందం ప్రకారం ఖుజాఅ వారిని తప్పక ఆదుకుంటారని వారికి గట్టిగా తెలుసు. అందువల్ల వారు తమ నాయకుడు అబూ సుఫ్యాన్‌ని ప్రవక్త శ్రీ వద్దకు క్షమాపణ వేడుకునేందుకు పంపారు. ఆయన(స) వీల్లేదన్నారు. అప్పుడు అబూసుఫ్యాన్ ప్రవక్త సన్నిహిత సహచరులు, ప్రవక్త వద్ద చనువు గలవారు, మహనీయ అబూ బక్ర్‌ని కలవాలని అనుకున్నాడు. ఆయన వద్దకు వచ్చి ప్రాధేయపడ్డాడు, ఎలాగయినా ఒప్పందాన్ని పునరుద్ధరింప జేయాలని. ఆయన కూడా గట్టిగా నిరాకరించారు.

## మక్కా వైపునకు

ప్రవక్తశ్రీ (స) ముస్లిములను కురైష్‌తో తాడో పేడో తేల్చుకునేందుకు సన్నద్ధులు కావలసిందని ఆదేశించారు. సేనను సిద్ధం చేసే బాధ్యత మహనీయ అబూ బక్ర్‌కు అప్పగించారు. అందులో విభిన్న తెగల్ని వెనకా ముందూ ఏర్పరిచారు, అబూ బక్ర్. మున్ముందు గిఫారీ తెగ ఉండగా చివరన ముహాజిర్ సహచరులు, అందరికన్నా తక్కువ ఉన్న వారు ఉన్నారు. వారిలోనే ప్రవక్త శ్రీ కూడా ఉన్నారు.

హిజ్రీ 8వ సంవత్సరం, రమజాన్ 10వతేదీన (క్రీ. శ. 630, జనవరి మొదటి తేదీ) ఉదయం పూట పదివేల మంది సహచర మాన్యులను తోడుగా తీసుకుని బయలు దేరారు ప్రవక్త మహనీయులు (స).

మక్కాపుణ్యపురి ఇంకా కొన్ని మైళ్ళ దూరాన ఉండగా సేన మర్రుజ్జహ్రాన్ అనే చోటికి చేరింది. అక్కడే ఆగి నమాజ్ చేసుకోవలసిందిగా ఆదేశించారు ప్రవక్త (శ్రీ).

ఆ తరువాత ముస్లిమ్ యోధుల్ని పది గ్రూపులుగా విభజించి దూర దూరంగా క్యాంపులు ఏర్పాటు చేసి మంటలు రాజేయాలనీ, జాగరూకులయి ఉండ వలసిందనీ నిర్దేశించడం జరిగింది. మక్కా వారికి అప్పటి వరకు వీరిని గురించి ఏమీ తెలియదు, కాని ఓ విశాల మైదానంలో మిన్నంటిన మంటలు, పెద్ద ఎత్తున జన సంచారం చూడగానే వారి హృదయాలు క్రుంగిపోయాయి.

## మారు మనసు!

మరుసటి దినం సత్య కాముకులు ముస్లిములు, దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకుంటూ తెగవారిగా మక్కా పుణ్యపురిలోకి ప్రవేశించేందుకు కదిలారు. ప్రవక్త మహనీయులు (స) తన ఒంటె "కస్వా" మీద ఉపవిష్ఠులయి ఉన్నారు. తిరస్కారులు ఈ దైవదాసుల సేనను చూసి భయ విహ్వళురయి పోయారు.

అది రమజాన్ నెల 20వ తారీఖు. దైవ కారుణ్యంలో ముద్దయి పోయిన ఈ ఇస్లామ్ సేవకులు, ఏకోన్ముఖుడయిన దైవ భక్తుడు నిర్మించిన కాబా గృహం వద్దకు దీపప్పురుగుల వలె కాబా చుట్టూ పరిభ్రమించడానికి అడుగు పెట్టారు.

దేవుని అంతిమ ప్రవక్త (స) తన ఒంటె మీద కూర్చునే ఏడు. కాబా ప్రదక్షిణలు పూర్తి చేశారు. కాబాలోని విగ్రహాలను తీయించి కాబా గృహాన్ని శుభ్రపరచిన తరువాత అందులోకి ప్రవేశించి రెండు రకతుల నమాజ్ ఆచరించారు. కారుణ్యమూర్తి ముహమ్మద్ (స) తమ రక్త పిపాసులయిన వారందరికీ సామాన్య క్షమాపణ ప్రకటించారు. ఈ సర్వ సామాన్య క్షమాపణ కారణంగా విరోధుల ఆంతర్యాలు మారిపోయాయి. కొందరు వ్రేళ్ళపై లెక్కించదగ్గ వారు తప్ప కురైష్ ప్రజలందరూ ఇస్లామ్ స్వీకరించారు. బింకం చూపిన వారు కూడా ఆ తరువాత ఇస్లామ్ ఆశ్రయంలోకి వచ్చేశారు.

ఇవి, ప్రవక్త శ్రీ(స) తాను కల ద్వారా దైవాదేశం గ్రహించి, ఉమ్రా చేసేందుకు మక్కా పయనమవగా మధ్యలో హుదైబియా అనే చోట మక్కా వాసులతో అనివార్యంగా జరిగిన ఒప్పందం, దాని రీత్యా చేయలేక పోయిన ఉమ్రాకు బదులుగా చేసిన ఉమ్రా (కజా ఉమ్రా)కు ఫలితాలు !

★★★


సహజీవన భావనల పత్రిక గీటురాయి వారపత్రిక

**ముఖ్య ఆశయాలు**

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.




**పశ్చిమాసియా**లో జరుగుతున్న యుద్ధంలో ఇస్రాయిల్ ఫేకు వార్తల ఫ్యాక్టరీ రాత్రింబవళ్ళు పనిచేస్తోంది. ఒక ఫేక్ వీడియోలో ఆసుపత్రిలో ట్యూబులతో ఉన్న ఒక వ్యక్తిని చూపించారు. ఆ వ్యక్తి ఒక యాక్టరని, పాలస్తీనా బాధితుడిగా నటిస్తున్నాడని ప్రచారం మొదలు పెట్టారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు కూడా పాలస్తీనాలో మరణాల సంఖ్య గురించి వస్తున్న వార్తలను తాను నమ్మలేనంటూ తన వైఖరి బయటపెట్టుకున్నాడన్నది కూడా గుర్తుంచుకోవాలి. ఏది ఏమైనా ఆసుపత్రిలో ట్యూబులు తగిలించి బెడ్డుపై ఉన్న వ్యక్తి నటుడంటూ ప్రచారం మొదలు పెట్టారు. ఇస్రాయిల్‌కు చెందిన అధికారిక ట్విట్టరు ఖాతా ఈ వీడియోను ప్రచారంలో పెట్టింది. ఈ వీడియోలో ఏముందంటే, మొదటి క్లిప్పులో హమాస్ దాడికి సంతోషిస్తూ గాజా వీధుల్లో నడిచి వెళుతున్న ఒక వ్యక్తిని చూపించారు. ఆ తర్వాతి ట్వీటులో ఆసుపత్రిలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అతను యాక్టింగ్ చేస్తున్నాడని ప్రచారం చేశారు. ఆల్ట్ న్యూస్ నిజనిర్ధారణలో తెలిసిందేమిటంటే, మొదటి క్లిప్పులో ఉన్న వ్యక్తి పేరు సాలెహ్ అల్ జఫారవీ. ఇన్‌స్టాగ్రాంలో అతను గాజాకు సంబంధించిన అనేక వీడియోలను షేరు చేస్తుంటాడు. అతనికి ఒక యు ట్యూబ్ చానల్ కూడా ఉంది. అందులో తన మ్యూజిక్ వీడియోలు పెడుతుంటాడు. అతను గాజాలో పాడుతూ వెళుతున్న వీడియో అగస్టు 19 నాటిదిగా తెలిసింది. ఇక రెండవ వీడియో విషయానికి వస్తే అది కూడా జులై 24 నాటిది. వెస్ట్ బ్యాంకులోని నూర్ షామ్స్ శరణార్థి శిబిరంపై ఇస్రాయిల్ అప్పుడు చేసిన దాడిలో ముహమ్మద్ జెందిక్ అనే 16 సంవత్సరాల కుర్రాడు కాలు పోగొట్టుకున్నాడు. అతడిని ఆసుపత్రిలో చేర్చారు. ఈ రెండు వీడియోలు తీసిన కాలం వేరు, వీడియోల్లో ఉన్న వ్యక్తులు వేర్వేరు. పైగా ఆసుపత్రిలో గాయాలతో చికిత్స పొందుతున్న పాలస్తీనా యువకుడు వెస్ట్ బ్యాంకులో ఇస్రాయిల్ దాడుల్లో కాలు పోగొట్టుకున్న వాడు. ఇలా ఇస్రాయిల్ చేసిన దాడుల్లో మరణించిన వారెంతమందో. ఈ సమస్య హమాస్ దాడి తర్వాత ప్రారంభం కాలేదు. కాని ఈ ఫేకు వార్తలతో తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చాలా హుషారుగా చాలా మంది చేస్తున్నారు. ఇస్రాయిల్ సాధారణ ప్రజలపై, ఆసుపత్రులపై దాడులు చేస్తూ పసిపిల్లలను చంపుతున్న ఇస్రాయిల్ పట్ల ప్రజాభిప్రాయాన్ని మలచడానికి రకరకాల ఫేకు వార్తలు ప్రచారంలో పెడుతున్నారు.

అలాంటి మరో వార్త ఏమిటంటే, తెల్లటి వస్త్రాల్లో చుట్టబడి ఉన్న ఒక వ్యక్తి ఫోటో వైరల్ చేశారు. అంటే శవంలా కనిపిస్తున్న వ్యక్తి ఫోటో. కాని ఆ వ్యక్తి తన మొబైల్ వాడుతున్నట్లు ఫోటోలో కనిపిస్తుంది. పాలస్తీనీయులు చాలా మంది చచ్చిపోయినట్లు అబద్ధపు మరణ వార్తలు ప్రచారం చేస్తున్నారని, నిజానికి మరణించ లేదని బతికే ఉన్నారని ప్రచారం మొదలుపెట్టారు. బూమ్ వార్త సంస్థ నిజనిర్ధారణలో తెలిసిందేమిటంటే, ఈ ఫోటో థాయిలాండ్‌లో 2022లో జరిగిన ఒక హాలోవీన్ పార్టీకి సంబంధించిన ఫోటో. ఇస్రాయిల్, హమాస్ మధ్య యుద్ధానికి ఈ ఫోటోకు సంబంధమే లేదు. గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకారం 7 వేల మంది మరణించారు. కాని అమెరికా అధ్యక్షుడు

జో బైడెన్‌కు ఈ మాటలు నమ్మశక్యంగా లేవు. ఇవి నమ్మశక్యం కాదని చెప్పడానికి ఇలాంటి లేకి, వెకిలి వైరల్ వార్తలు ప్రచారం చేసి ఇస్రాయీల్ మాటలను, అమెరికా మాటలను నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇలాంటిదే మరో వార్త వచ్చింది. సిరియాకు సంబంధించిన మూడు ఫోటోలు ప్రచారంలో పెట్టారు. ఈ మూడు ఫోటోలు వేర్వేరు ఫోటోలు. ప్రతి ఫోటోలో ఒక చిన్నపిల్లను కాపాడి ఒక వ్యక్తి ఎత్తుకుని వెళుతున్నట్లు ఉంది. ఒకే అమ్మాయిని మూడు సార్లు ముగ్గురు ఎలా కాపాడారో చూడండంటూ వెకిలి హాస్యంతో కూడిన వైరల్ వార్త ప్రచారంలో పెట్టారు. ఇస్రాయీల్‌కు మద్దతు పలుకుతున్న ఖాతాలు ఈ వెకిలి ప్రచారం చేశాయి. పాలస్తీనీయులు తమ పిల్లలు గాయపడ్డారని చెప్పడానికి ఫేక్ ఫోటోలు ప్రచారం చేస్తున్నారంటూ ఈ వైరల్ ప్రచారం మొదలు పెట్టారు. ఆ మూడు చిత్రాల్లో ఉన్న అమ్మాయి ధరించిన దుస్తులు ఒకే మాదిరి ఉన్నాయి. చింపిరి జుత్తు ఉంది. ముఖం దుమ్ము కొట్టుకుని ఉంది. బూమ్ నిజనిర్ధారణలో తెలిసిందేమిటంటే ఈ ఫోటో 2016 సిరియాలోని అలెప్పోలో జరిగిన యుద్ధం నాటి ఫోటోలు. అలెప్పోలో తిరుగుబాటు దారులు ఆక్రమించుకున్న ప్రాంతంలో ఒక చోట జరిగిన బాంబుదాడిలో 16 మంది మరణించారు. ఆ ఒకే సంఘటనకు సంబంధించినవి ఆ మూడు ఫోటోలు. ఆ అమ్మాయిని శిధిలాల్లోంచి కాపాడి సహాయక బృందం తీసుకువచ్చి ఒకరి తర్వాత ఒకరికి అప్పగిస్తూ సురక్షిత ప్రాంతానికి చేర్చిన ఫోటోలు అవి. పశ్చిమాసియా యుద్ధంలో ఇక్కడి మతతత్వ శక్తులు విద్వేష చిచ్చుపెట్టి చలి కాగడానికి, ఎన్నికల ప్రయోజనాలు పొందడానికి ప్రయత్నిస్తున్నాయి.

కేరళలో పాలస్తీనాకు మద్దతుగా ఒక ర్యాలీ జరిగింది. దీనికి సంబంధించి ఒక వీడియో వైరల్ అయ్యింది. ఈ ర్యాలీలో నిరసనకారులు చేతపట్టిన జెండా ఇటలీ జాతీయ జెండా అంటూ ప్రచారం చేశారు. భారతీయ జనతా యువ మోర్చాకు చెందిన తాజిందర్ పాల్ సింగ్ బగ్గా ఈ క్లిప్పును ట్వీటు చేశాడు. గతంలో కూడా బీజేపీకి చెందిన ఈ బగ్గా అనేకసార్లు ఫేక్ వార్తలు ప్రచారంలో పెట్టిన ఘనుడు. దేశంలో పెరిగిపోతున్న ఇస్లామిక్ రేడికలిజం అంటూ బీజేపీ ప్రతినిధి అనిల్ కే ఆంటోనీ కూడా దీన్ని రీట్వీటు చేశాడు. కాని ఈ ప్రచారం చేసినవాళ్ళు ఆ జెండాలపై వెల్ఫేర్ పార్టీ, కేరళ అని ఉన్న పదాలు చదవలేదు. చదివినా చదవనట్టు నటించారు. మతం చిచ్చుపెట్టడానికి వాడుకోవాలనుకుంటున్నప్పుడు ఇలాంటివి కనిపించవు. ఆల్ట్ న్యూస్ నిజనిర్ధారణలో ఈ జెండాలు వెల్ఫేర్ పార్టీ జెండాలని తెలిసింది. ఇక్కడ మతతత్వ శక్తులు ఫేకు వార్తలను ప్రచారంలో పెట్టడం ఎప్పటి మాదిరిగానే కొనసాగుతూనే ఉంది. హిందుమతం గురించి అనుచితంగా మాట్లాడుతున్న ఒక వ్యక్తి వీడియో ఒకటి వైరల్ అయ్యింది. తనను తాను ముస్లింగా ఆ వ్యక్తి చెప్పుకున్నాడు. తలపాగా చుట్టుకున్న ఆ వ్యక్తి తనను తాను జావేద్ హుస్సేన్ అని చెప్పుకున్నాడు. హిందూమతం గురించి, బ్రాహ్మల గురించి వీడు అవాకులు చెవాకులు వాగుతుంటే పక్కనుంచి మరొకరి గొంతు వినిపిస్తుంది. ఈ గొంతు వ్యక్తి కనిపించడు. కాని ఈ అవాకులు చెవాకులను వ్యతిరేకిస్తూ తాను హిందువు కాబట్టి చాలా శాంతిగా వింటున్నానని అంటున్నాడు. బూమ్ వార్తసంస్థ నిజనిర్ధారణలో ఇది హరిద్వార్‌కు చెందిన వీడియోగా తెలిసింది. హరిద్వార్ పోలీసు అధికారితో మాట్లాడితే ఆయన అసలు విషయం చెప్పాడు. ఆ వ్యక్తి ముస్లిం కాదు. ఈ అవాకులు చెవాకులు పేలిన వ్యక్తి కూడా తర్వాత తాను తాగిన మత్తులో ముస్లింగా చెప్పుకున్నానని, తన పేరు దిలీప్ బాఘేల్ అని ఒప్పుకున్నాడు. కాని సుదర్శన్ న్యూస్ జర్నలిస్టు సాగర్ కుమార్ అనేవాడు మాత్రం "నా ఉత్తరాఖండ్‌ను కాపాడండి" అంటూ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ఈ క్లిప్పును ప్రచారంలో పెట్టాడు. ఈ వీడియో వచ్చిన తర్వాత పోలీసులు దీనిపై విచారణ చేసి నిజాలు బయట పెట్టారు. కొందరు ఆ వ్యక్తిని తాగించి హిందూ మతంపై అవాకులు చెవాకులు పేలేలా ప్రోత్సహించారని, ఆ తర్వాత వీడియో తీసి ప్రచారంలో పెట్టారని, కేసు విచారిస్తున్నామని తెలియజేయడమే కాదు, ఈ విషయాన్ని ట్వీటు చేసి ప్రజలకు తెలియజేశారు.

ఇంకో ఫేకు వార్తలో బస్సుస్టాపు గురించి జరిగిన గొడవకు మతం రంగు పులిమి ప్రచారంలో పెట్టారు. ఇది కేరళలోని కసారాగోడ్‌లో జరిగిన సంఘటన. కొందరు విద్యార్థినులు ఒక మహిళతో ఒక ప్రయివేటు బస్సులో ఘర్షణ పడుతున్న వీడియో వైరల్ అయ్యింది. ఆ విద్యార్థినులు బస్సును తమ కాలేజీ వద్ద ఆపాలని చెబుతున్నారు. ఆ మహిళ దానికి ఒప్పుకోవడం లేదు. కాని ఈ వీడియోను ప్రచారంలో పెట్టి బురఖా ధరించిన ముస్లిం మహిళలు బురఖా లేని హిందూ మహిళను అందరిలో అవమానిస్తున్నారని ప్రచారం చేశారు. బూమ్ నిజనిర్ధారణ కోసం సంబంధిత పోలీసులను సంప్రదించింది. పోలీసులు ఈ వైరల్ ప్రచారాన్ని అబద్ధంగా చెప్పారు. కొందరు విద్యార్థినులు తమ కాలేజీ వద్ద బస్సు ఆపాలని కోరారని, ఒక మహిళ అభ్యంతరం చెప్పిందని దానికి సంబంధించిన ఘర్షణగా చెప్పారు. ఆ విద్యార్థినులందరూ బురఖాలు ధరించిన ముస్లిం అమ్మాయిలు. ఆ మహిళ చీర కట్టుకున్న మహిళ. బురఖా ధరించిన అమ్మాయిలకు సంబంధించిన వీడియో కాబట్టి మతతత్వ శక్తులకు ఫేకు వార్తలు ప్రచారం చేసే అవకాశం దొరికింది. ఇలాంటి ఫేకు వార్తలను నమ్మితే ఎలాంటి విద్వేష భారతం భవిష్యత్తులో మనకు కనబడుతుందో ప్రజలంతా ఆలోచించాలి.

❖



# మౌలానా అబుల్ కలామ్ ఆజాద్

## నవంబర్ 11 మౌలానా ఆజాద్ జయంతి/ జాతీయ విద్యా దినోత్సవం

- యం.డి. ఉస్మాన్‌ఖాన్

**భారతదేశ** మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్- ఈయన పూర్తిపేరు సయ్యిద్ అబుల్ కలాం గులాం మొహియుద్దీన్ అహ్మద్ ఆజాద్. తండ్రి ముద్దుగా ఫిరోజ్ బఖ్త్ అని పిలుచుకునేవారు. అబుల్ కలాం అనేది బిరుదు. కలం పేరు ఆజాద్ .1888 నవంబర్ 11వ తేదీన సౌదీ అరేబియాలోని మక్కాలో ఒక సంపన్న ధార్మిక కుటుంబంలో ఆయన జన్మించారు. ఆలియా బేగం, మౌలానా ఖైరుద్దీన్ అహ్మద్‌లు తల్లిదండ్రులు. మౌలానా ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వాతంత్ర్య సమర యోధుడు, గొప్ప తత్వవేత్త, సాహితీవేత్త, విద్యావేత్త, రచయిత, వక్త, రాజకీయ వేత్త, ఆధునిక భారత విద్యావ్యవస్థ నిర్మాత. అంతేకాదు గొప్ప కవి కూడా.. అరబీ, ఉర్దూ, ఫార్సీ, హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ వంటి అనేక భాషల్లో ఆయన నిష్ణాతుడు.1940 నుండి 1946 వరకు భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షులుగా ఉన్నారు. 35 సంవత్సరాల అతి పిన్న వయసులోనే ఆయన భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించారు. స్వాతంత్ర్యానంతరం భారత దేశానికి మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా నెహ్రు మంత్రి వర్గంలో పనిచేశారు. 1947 నుండి 52 వరకు విద్యాశాఖమంత్రిగా, 1952 నుండి 58 వరకు విద్యా, ప్రకృతి వనరులు, శాస్త్ర సాంకేతిక మంత్రిగా, 1956లో యునెస్కో అధ్యక్షునిగా పనిచేసిన మౌలానా ఆజాద్ అసమానమైన రీతిలో విద్యాభివృద్ధికి కృషిచేసారు. ప్రతి చిన్నారికీ 14 సంవత్సరాల వయసు వరకూ ఉచిత నిర్బంధ విద్య అమలు చేశారు, మహిళల విద్యాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేశారు. దేశ పౌరులుగా బాధ్యతలు సక్రమంగా నిర్వహించడానికి కావలసిన ప్రాథమిక విద్యను పొందడం ప్రతి ఒక్కరి జన్మ హక్కనీ, ఈ విషయాన్ని మనం ఒక్క క్షణం కూడా మరువరాద న్నారు. మూస విధానాలకు స్వస్తి చెప్పి, అనేక నూతన ఆవిష్కరణలకు నాంది పలికారు. విద్యా రంగంలో శాస్త్ర, సాంకేతికతను పెంపొందించడానికి విశేష కృషి చేశారు. బ్రిటిష్ దొరల నుండి సంక్రమించిన విద్యావిధానం భారత జాతీయ ప్రయోజనాలకు ఎంతమాత్రం సరికాదని, అది మన దేశ పౌరులు కానివారు రూపొందించి మనపై రుద్దినదని తీవ్రంగా నిరసించారు. మన జాతీయ ప్రయోజనాలు, అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని రూపొందించడమే తన లక్ష్యమన్నారు. 1951లో ఖరగ్‌పూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ టెక్నాలజీని స్థాపించడం మౌలానా ఆజాద్ ఘనతే. చివరి శ్వాస వరకూ దేశంలో విద్యా రంగ అభివృద్ధి కోసం కృషి చేసిన మౌలానా గౌరవార్థం దేశంలో అనేక విద్యా సంస్థలకు ఆయన పేరు పెట్టారు. 1921లో సహాయ నిరాకరణ, 1930లో శాసనోల్లంఘన, 1942లో క్విట్ ఇండియా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ క్రమంలో నాయకత్వంలో ఏర్పడిన విభేధాలను, నివారించి, విభిన్న అభిప్రాయాలు కలిగిన ఉద్యమ శక్తుల్ని ఏకతాటిపై నడిపించారు. ఉద్యమ జీవితంలో పది సంవత్సరాలకు పైగా జైలు జీవితం అనుభవించిన మౌలానా ఆజాద్ మాతృదేశ విముక్తి పోరులో చిరస్మరణీయ పాత్రను పోషించి, దేశభక్తి, లౌకక వాదానికి ప్రతీకగా నిలిచారు.

1890లో ఆయన కుటుంబం కలకత్తా వచ్చి స్థిరపడింది. అప్పటికి ఆయన రెండు సంవత్సరాల పసికందు. మౌలానా ఆజాద్ ప్రాథమిక విద్య ఇంటివద్దనే తల్లితండ్రుల దగ్గర నేర్చుకున్నారు. గురువులు కూడా ఆయనకు ఇంటి వద్దనే విద్య బోధించారు. పన్నెండేళ్ళ వయసులోనే ఆయనకు ప్రత్యేకంగా రీడింగ్ రూమ్, సొంత లైబ్రరీ ఉండేవి. మొదట పార్సీ, అరబీ విద్యలు ఔపోసన పట్టారు. తరువాత ఫ్రాన్స్, ఇంగ్లీషు గ్రంథాల విస్తృత అధ్యయనం ప్రారంభించారు. తనకంటే పెద్ద విద్యార్థులకు ఆయన క్లాసులు చెప్పేవారు.1900 వ సంవత్సరంలో మౌలానా విద్యాభ్యాసం పూర్తయింది. ప్రపంచ చరిత్ర, తత్వశాస్త్రం, రాజకీయాలు ఇత్యాదివన్నీ స్వీయ అధ్యయనం ద్వారానే నేర్చుకున్నారు. మౌలానా గొప్ప విద్యావేత్తగా, మేధావిగా, రాజకీయ వేత్తగా, సమరయోధుడిగా, పాత్రికేయుడిగా, రచయితగా, కవిగా... ఇలా విభిన్న రంగాల్లో అవగాహన, ఆసక్తి, నైపుణ్యం కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి. పాత్రికేయ రంగమైనా, విద్యా రంగమైనా, అరబ్బీ భాషా నైపుణ్యమైనా, రాజకీయ, ఆర్థిక రంగ పరిజ్ఞానమైనా, ప్రతి రంగంలోనూ ఆయనది అందవేసిన చెయ్యే. మౌలానా ఉపన్యాసాలు, రచనలు ఇప్పటికీ, ఈ తరానికీ సరైన దశా దిశను నిర్దేశిస్తున్నాయి. సంకల్ప బలం, లక్ష్యసాధన, చిత్తశుద్ధి, క్లిష్ట పరిస్థితుల్లో సైతం మౌలానా కనబరిచే స్థిరచిత్తం ఎంతటి వారినైనా అబ్బురపరుస్తుంది. 'మౌలానా! మీ రచనల్లో, మీ ప్రసంగాల్లో ఇంతటి విజ్ఞాన భాండాగారం దాగి ఉండటానికి కారణమేమిటి?' అని ఎవరైనా ప్రశ్నిస్తే, 'ప్రపంచమంతా నిద్రమత్తులో జోగుతున్నప్పుడు నేను మేల్కొని ఉంటాను. అదే నా రహస్యం' అని వినమ్రంగా సమాధానం చెప్పిన కార్యశీలి. అందుకే, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ సైతం మౌలానా రాజకీయ, సామాజిక పరిణతి గురించి ప్రశంసించకుండా ఉండలేక పోయారు. ఈ కారణంగానే మౌలానా ఆజాద్ పుట్టిన రోజును దేశమంతా జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటోంది. అదే రోజును జాతీయ మైనారిటీ సంక్షేమ దినోత్సవంగానూ జరుపుకుంటారు. మౌలానా నిష్టాగరిష్ఠుడైన ధార్మిక పండితుడు. పరమత ప్రేమికుడు. నిఖార్సయిన మానవతావాది. హిందూ - ముస్లింల ఐక్యతను పెంపొందించడమే ధ్యేయంగా 'అల్- హిలాల్' అనే పత్రికను స్థాపించారు. కాని అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఆ పత్రికను నిషేధించడంతో 'అల్- బలాగ్'లి పేరుతో మరో పత్రికను ప్రారంభించారు. ఆయన మొట్టమొదట రాసిన గజల్ 'అర్మగానె ఫర్ఖ్' పత్రికలో ప్రచురితమైంది. తరువాత లక్నో నుండి వెలువడే 'ఖుదంగె నజర్', 'పయామెయార్' పత్రికల్లో ఆయన కవిత్వం క్రమం తప్పకుండా ప్రచురితమయ్యేది. సాహిత్యంపై అమితమైన మక్కువ కలిగిన మౌలానా స్వయంగానే ఒక పత్రిక తియ్యాలని నిర్ణయించుకున్నారు. ఆయన మొట్ట మొదట ప్రారంభించిన పత్రిక 'లిసాన్- ఒ సిద్?' అప్పటికాయన మౌల్వీ జఫరుల్ హసన్ షౌఖ్ పర్యవేక్షణలో సాహిత్య అధ్యయనం కొనసాగిస్తున్నారు. కవిత్వంపై ఉన్నమక్కువతో ఆయన 'నైరంగ్ ఆలం' పేరుతో ఓ సాహిత్య పత్రికను కూడా ప్రారంభించారు. అది ఎనిమిది నెలల పాటు నిరాటంకంగా వెలువడింది, పిన్న వయసులోనే ఆయన మౌలానా ఇబ్నెరుష్ద్, ఇమాం గజాలీ, మౌల్వీ కబీరుద్దీన్ మాలిక్ లాంటివారి సుప్రసిద్ధ గ్రంథాలను అధ్యయనం చేశారు. తర్జుమానుల్ ఖురాన్ పేరుతో పవిత్ర ఖురాన్ గ్రంథానికి వ్యాఖ్యానం రాశారు. అల్ హిలాల్, తర్జుమానుల్ ఖురాన్, అల్ బలాగ్ పత్రికలను స్వయంగా స్థాపించారు. గుబార్- ఎ ఖాతిర్, ఇండియా విన్స్ ఫ్రీడం, అల్ బయాన్, అల్ బసాయిర్, జామిఉష్షవాహిద్, ఖిలాఫత్, జజీరుల్ అరబ్, ఖుత్బాత్ గ్రంథాలు రచించారు. అల్ మతీన్, వకీల్, జమీందార్, హందర్ద్, ముస్లిం గెజిట్, అల్ హాకిమ్, అల్ హఖ్, కామ్రేడ్ లాంటి ప్రముఖ పత్రికలకు వ్యాసాలు రాశారు. మౌలానా ఆజాద్ భారత స్వాతంత్ర్య సమర యోధుడు. గొప్పనాయకుడు. గాంధీజీతో కలిసి భుజం భుజం కలిపి నడిచారు. అనేక ఉద్యమాల్లో గాంధీజీకి వెన్నుదన్నుగా నిలిచారు. ప్లాటో, అరిస్టాటిల్ , పైథాగరస్ అంతటి తెలివైనవారని, 'ద ఎంపరర్ ఆఫ్ లెర్నింగ్' అని గాంధీజీ, నెహ్రూలచే కీర్తించబడ్డారు. భారత్, పాకిస్తాన్ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. జిన్నాతో విభేధించారు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం , క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని, పిన్న వయసులోనే జైలు శిక్ష అనుభవించారు. మౌలానా ఆజాద్ మరణానంతరం 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ఆయనకు లభించింది. లౌకికవాదానికి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1958 ఫిబ్రవరి 22వ తేదీన ఢిల్లీలో గుండెపోటుతో మరణించారు. మౌలానా గౌరవార్థం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవాలని 2008, సెప్టెంబరు 11న కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దేశంలోని అన్ని విద్యాసంస్థలు విద్యపై సదస్సులు, వ్యాస రచన, ఉపన్యాస పోటీలు, శిక్షణా శిబిరాలు నిర్వహించాలని, అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీలు తీయాలని, నినాదాలు ఇవ్వాలని ఆదేశించింది. కనుక మైనారిటీ గురుకులకే పరిమితం చేయకుండా, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ మౌలానా ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆ మహనీయుని స్ఫూర్తిని విద్యార్థులతో పాటు, నేటి రాజకీయ తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

❖

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

# మానవ ఏకతా సిద్ధాంతకర్త


# ఆదర్శమూర్తి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)

**మనిషిని** మానవునిగా మలచిన మహా మనీషి, మానవాళికి దైవభక్తినీ, నైతిక రీతినీ ప్రబోధించిన మానవ మహోపకారి, అంతిమ దైవసందేశహరుడు ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లమ్) పవిత్ర జీవితంలోని వివిధ కోణాలను విశదీకరించే పుస్తకాలు ఉరుదూ, ఇంగ్లీషులోనే కాదు, తెలుగు భాషలో సయితం అనేకం ప్రాచుర్యంలోనికి వచ్చాయి. టి.ఐ.పి ఆధ్వర్యంలో కూడా అనేక చిన్నా పెద్దా సీరత్ పుస్తకాలు ముద్రితమయ్యాయి.

వాటిలో కొన్ని పుస్తకాలు నవల తరహాలో ఉండి పాఠకులను ఉర్రూతలూగిస్తే, మరికొన్ని రచనలు ఉద్యమ కారులకు స్ఫూర్తి నిచ్చేవిగా ఉన్నాయి. కొన్ని పుస్తకాలు బద్ర్, ఉహుద్ రణరంగాలను హృద్యంగా చిత్రించగా, మరికొన్ని రచనలు మహిమాన్విత విషయాలను ఫోకస్ చేశాయి. ఇంకా కొన్ని పుస్తకాలు మానవీయ నైతిక కోణాలను విశదీకరించాయి.

టి.ఐ.పి ద్వారా ప్రచురించబడిన 'మహాప్రవక్త జీవిత చరిత్ర' (హయాతె తయ్యిబా) అయినా, 'ఎడారిపువ్వు' (దుర్రె యతీమ్) అయినా, ఇంతెజార్ నయీమ్ గారి 'మానవ మహోపకారి' (ముహ్సినె ఇన్‌సానియత్) అయినా ఈ కోవకు చెందినవే. ప్రతి పుస్తకం తనదైన ప్రాధాన్యతను కలిగి ఉన్న విషయం వాస్తవమే. (ఇలాంటి పుస్తకాల్లో చాలావరకు అనువాదాలే).

కాని సీరత్ గ్రంథాన్ని ఒకే సమయంలో ప్రవక్త సమగ్ర జీవితంగా సమర్పించడంతోపాటు దాని సందేశ ప్రధానమైన కోణాన్ని ప్రత్యేకంగా ఆవిష్కరించే ప్రయత్నం ఇంతవరకు దాదాపు జరగ లేదనే చెప్పాలి. నలభయ్యేళ్ళ క్రితం మలిక్ గారే స్వయంగా "ఆదర్శమూర్తి" పేరుతో ఒక పుస్తకం రాశారు. కాని అది చిరు పుస్తకమే. (ఇప్పటికి అది 84 ఎడిషన్లు ముద్రితమై దాదాపు రెండున్నర లక్షల పుస్తకాలు అమ్ముడయ్యాయి. అది వేరే విష యం). తెలుగులో అటువంటి ప్రయత్నానికి మొట్టమొదటిసారిగా పూనుకున్న రచయిత శ్రీ ఎస్.ఎమ్ మలిక్. "ఆదర్శమూర్తి




| | |
|---|---|
| సంకలనం : | ఎస్.ఎమ్. మలిక్ |
| పేజీలు : | 532 |
| వెల : | 400/- |
| కాపీలకు : | తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్, హైదరాబాద్ |

ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)" మకుటంతో ఇలాంటి ఒక గ్రంథ రచనకు ఎందుకు పూనుకున్నారు? అన్న ప్రశ్నకు శ్రీ ఎస్.ఎమ్ మలిక్ ఇచ్చే సమాధానం ఇది-

"1981లో నేను మౌలానా అబూ సలీమ్ అబుల్ హై వ్రాసిన 'హయాతె తయ్యిబా' అనే ఉర్దూ పుస్తకాన్ని తెలుగులో అనువదించి ప్రచురించినప్పుడు, దానికి పత్రికల్లో వచ్చిన సమీక్షల్లో ఒక వాక్యం నన్ను బాగా కదిలించింది. అప్పుడు

కేవలం ఓ కోరిక కలిగింది, ప్రవక్త సచ్చరితను దీనికి భిన్నంగా ఎవరయినా తెలుగులో వ్రాస్తే ఎంత బావుండేది అని! కాని నా కోరిక కోరికగానే మిగిలిపోయింది.''

''2003లో కొంతమంది రచయితల (మౌలానా ఫారూఖ్ ఖాన్, శ్రీ ఇక్బాల్ జహీర్)కు నా ఆలోచనను వివరించి, వారిని వ్రాయమని కోరినప్పుడు, 'ఈ ఊహ నీది, నీవే దానికి న్యాయం చేకూర్చగలవు' అని వారు చెప్పారు.''

తఫ్హీముల్ ఖుర్ఆన్ (ఖుర్ఆన్ అవగాహనం) అనువాద కార్యం వల్ల గానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్కు ముఆవిన్ అమీరె హల్ఖాగా, దావా సెక్రటరీగా బాధ్యతలుండటం వల్ల గానీ అప్పట్లో నేను నా ఊహకు అక్షర రూపం ఇవ్వలేకపోయాను. అయితే ఉపాధ్యక్షునిగా, సందేశ కార్యదర్శిగా అప్పటి ఆంధ్రప్రదేశ్లోని పలు జిల్లాలలో, పలు వర్గాల ప్రజలను కలుసుకున్నప్పుడు ఇలాంటి ఒక రచన చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అర్థం చేసుకున్నానంటారు రచయిత.

ఒక తెలుగు రచయితగా, పత్రికా సంపాదకునిగా తెలుగు పాఠకుల నాడిని, వారి అభిరుచిని, అవసరాలను ఎరిగిన మలిక్ గారు 2021లో ఈ సచ్చరితకు అక్షర రూపం ఇవ్వటం మొదలెట్టారు. గీటురాయి వారపత్రికలో ఈ పుస్తకం 'సచ్చరిత పత్రాలు' శీర్షికతో మొత్తం 82 ఎపిసోడ్లలో- ధారావాహికంగా- వచ్చింది. తెలుగు నుడికారపు ఒంపుసొంపులపై అసాధారణమయిన పట్టు ఉన్న ఈ రచయిత సీరత్లోని లోతైన సాగరంలో బాగా మునిగిపోయి, అందలి విలువైన ముత్యాలు పగడాలను వెలికి తీశారు. విశ్వవిఖ్యాత 'సీరత్ ఇబ్నె హిషామ్' గ్రంథాన్ని, మౌలానా మౌదూదీ విరచితమైన 'సీరత్ సర్వరె ఆలమ్'ను, 'సీరత్ ఎన్సైక్లోపీడియా'ను లోతుగా అధ్యయనం చేసి, తనదైన శైలిలో **'ఆదర్శమూర్తి ముహమ్మద్ (సఅసమ్)'**ను తెలుగు పాఠకులకు సమర్పించారు. ఈ పుస్తకంలోని అధ్యాయాలన్నింటినీ- గీటురాయిలోనే- చదివిన నేను ఆ జ్ఞాన సుధార్ఝరిని తనివితీరా జుర్రుకున్నాను. ముఖ్యంగా **'తప్పు ఒప్పుకున్న ముగ్గురు'** సహచర మాన్యుల సంఘటనను, **'అపనింద సంఘటన'**ను చదువుతున్నప్పుడు గుండె ద్రవిస్తుంది. **'ఆముల్ వుఫూద్'** అధ్యాయంలో- సఖీఫ్ తెగ వారు పెట్టిన షరతులకు మహాప్రవక్త ఇచ్చిన సమాధానాలు ఒక దాయీకి స్పష్టంగా మార్గబోధన చేస్తాయి. అలాగే వీడ్కోలు హజ్జ్ సందర్భంగా కారుణ్యమూర్తి చేసిన హితవులు ధరణిలోని ఆరు ఖండాలకు దీప స్తంభాల వంటివే. అలాగే మహాప్రవక్త ముహమ్మద్(స) సమగ్ర జీవితంలోని సంపూర్ణ స్వరూపాన్ని క్లుప్తంగా మన ముందు చిత్రిస్తూ రచయిత చేసిన పదప్రయోగంలో మచ్చుకు కొన్ని-

### నవ యుగ పురుషుడు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)

➢ ఆయన (ముహమ్మద్-స) కరుణా స్వరూపుడు, దయార్ద్ర హృదయుడు, మానవతా మూర్తి, దైవ సందేశహరుడు.

➢ ఆయన శాసనకర్త, రాజ్య నిర్మాత, పరిపాలనా దక్షుడు, దూరదృష్టి గల వ్యవహారకర్త.

➢ ఆయన విప్లవకారుడు, అనితర సాధ్య సందేశ ప్రదాత, అసాధారణ శిక్షకుడు.

➢ ఆయన అనాథ బాలుడు, ఎడారిపువ్వు, విశ్వ నాయకుడు, మానవ మహోపకారి.

➢ ఆయన సర్వదా ఆదర్శనీయుడు- సమాజంలో వ్యక్తిగా, కుటుంబ పెద్దగా, భర్తగా, తండ్రిగా, మిత్రునిగా, వ్యాపారిగా, రాజకీయవేత్తగా- ఆదర్శనీయుడు.

➢ ఆయన అంతర్జాతీయ శాసనానికి ఆద్యుడు, అభ్యుదయ నీతి శాస్త్ర నిర్మాత! ఆధునిక నాగరికతకు మూల విరాట్టు. మానవ ఏకతా సిద్ధాంతకర్త.


## చందాదారులకు విజ్ఞప్తి

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

16 అల్లాహ్ పిలుపునకు హాజరు పలికిన తరువాత ఎవరయితే (హాజరు పలికిన వారితో) అల్లాహ్ ధర్మం విషయంలో వాదులాటలకు దిగుతారో,[31] వారి వాదులాట వారి ప్రభువు దృష్టిలో మిథ్య; వారిపైన ఆయన ఆగ్రహం కలుగుతుంది, వారికి కఠిన శిక్షా పడుతుంది.

17–18 అల్లాహ్ ఆయనే, ధర్మబద్ధంగా ఈ గ్రంథాన్నీ, తరాజునూ అవతరింపజేసినవాడు.[32] మరి మీకేమెరుక, బహుశా నిర్ణయ ఘడియ దగ్గరకే వచ్చేసిందేమో.[33] ఎవరయితే దాని రాకపట్ల నమ్మకం కలిగి లేరో వారయితే దీనికొరకు తొందరపెడుతున్నారు. కాని దాన్ని విశ్వసించేవారు, దానికి భయపడతారు, అది నిశ్చయంగా వస్తుందని వారికి తెలుసు. బాగా వినండి, ఎవరయితే ఆ ఘడియ రాకను గురించి ఆశంకను రేపే వాదనలు చేస్తున్నారో వారు మార్గవిహీనతలో బహుదూరం వెళ్ళిపోయారు.

19 – అల్లాహ్ తన దాసుల పట్ల ఎంతో దయగలవాడు.[34] ఎవరికి ఏది తలచుకుంటే అది ఇచ్చి వేస్తాడు,[35] ఆయన మహాశక్తిమంతుడు, బలాధిక్యుడు.

31. ఇది ఆ రోజుల్లో మక్కాలో అనుదినం ఎదురవుతున్న పరిస్థితుల స్వరూపానికి సంకేతం. అప్పుడు ఎవరికయినా ఒక వ్యక్తి ఇస్లామ్ స్వీకరించినట్లు తెలియగానే అతని వెంట పడిపోయేవారు. చాలాకాలం వరకు అతని ప్రాణాలు ఇరుకున పడిపోయేవి. ఇంటిలోనూ అతనికి స్థిమితం లేకుండా చేసేవారు. వీధిలోనూ సముదాయంలోనూ నెమ్మది లేకుండా చేసేవారు. అతను ఎక్కడికి వెళ్ళినా అంతం కాని వాదన మొదలయ్యేది. దాని ఉద్దేశం, ఏ విధంగానయినా అతను మహనీయ ముహమ్మద్ (స) సహచర్యాన్ని వదలిపెట్టి మునుపటి అజ్ఞాన కాలపు వ్యవస్థలోకే, (తాను వదలి వచ్చిన వ్యవస్థలోకే) అతను తిరిగి రావాలన్నది.

32. తరాజు (తక్కెడ) అంటే ఉద్దేశం అల్లాహ్ షరీఅత్ అన్నది. అది తక్కెడలా తూచి సరయినది, తప్పయినది సత్యాసత్యాలు, న్యాయాన్యాయాలు, నిజాయితీనీ అవినీతినీ బేరీజు వేసి వ్యత్యాసం తెలుపుతుంది. పైన ప్రవక్త మహనీయుల నోట ఇలా పలికించబడింది, (మీ మధ్యన న్యాయం చెయ్యాలని నన్ను ఆదేశించడం జరిగింది). ఇక్కడ, ఈ గ్రంథంతో పాటు న్యాయం నిలబెట్టగల తక్కెడ వచ్చేసిందని తెలుపడం జరిగింది.

33. అంటే, ఎవరు చక్కబడదలచుకున్నారో వారు జాప్యం చేయకుండా చక్కబడాలి. తీర్పు ఘడియ దూరంగా ఉందని భావించి దాటవేయడం మంచిది కాదు. ఒక శ్వాసను గురించి కూడా మనిషి రూఢీగా చెప్పలేడు దాని తరువాత మరో శ్వాసకు అతనికి వ్యవధి తప్పక లభిస్తుందని. ప్రతి శ్వాసా చివరి శ్వాస కాగలదు.

34. మూలంలో **లతీఫున్** అనే పద ప్రయోగం జరిగింది. దాని పూర్తి భావం 'దయగలవాడు' అనే పదంతో పూర్తిగా స్ఫురించదు. ఇందులో రెండు భావాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి, అల్లాహ్ తన దాసుల పట్ల అమితమయిన వాత్సల్యం, అనుగ్రహం గలవాడన్నది; రెండు, ఆయన అత్యంత సూక్ష్మ దృష్టితో వారి అత్యంత సూక్ష్మమయిన అవసరాలను చూడగలుగుతాడన్నది, వాటివరకు మరెవరి దృష్టీ చేరజాలదు. స్వయంగా ఆ దాసులు కూడా గ్రహించలేరు తమ ఏ అవసరాన్ని ఎవరు ఎప్పుడు తీర్చివేశారో. ఇక్కడ దాసులంటే కేవలం విశ్వసించేవారని మాత్రమే అర్థం కాదు. సమస్త దాసులన్న మాట. అంటే, అల్లాహ్ దయ, అనుగ్రహం మానవులందరికీ సర్వసామాన్యమన్నమాట.

35. భావమేమిటంటే, ఈ సామాన్య అనుగ్రహం అన్నదాని ఉద్దేశం, దాసులు అందరికీ అంతా సమానంగా పంచిపెట్టాలన్నది కాదు. ఆయన తన ఖజానాల నుండి అందరికీ అనుగ్రహిస్తూ ఉన్నప్పటికీ ఆయన అనుగ్రహం లోనూ ప్రసాదం లోనూ సమత లేదు. ఒకరికి ఒక వస్తువు ఇస్తే మరొకరికి మరో వస్తువు ప్రదానం చేశాడు. ఒకరికి ఒక వస్తువు అధికంగా అనుగ్రహిస్తే మరొకరికి మరో వస్తువు పుష్కలంగా ప్రసాదించాడు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

**316)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: ఒకానొక ప్రయాణంలో మేము దైవప్రవక్త(సఅసం) వెంట ఉన్నాము. మేము 'బైదా' లేదా 'జాతుల్ జైష్' స్థలానికి చేరుకున్నప్పుడు నా కంఠహారం ఒకటి తెగి క్రిందపడిపోయింది. అందువల్ల దైవ ప్రవక్త(స) దాన్ని వెతకటానికి అక్కడే బస చేశారు. ప్రవక్త ప్రియసహచరులు (రజిఅల్లాహ్ అన్హుమ్) కూడా ఆయన(స)తోపాటే– అక్కడే– విడిది చేశారు. కాని ఆ ప్రదేశంలో నీరు లేదు. సహాబా వద్ద కూడా నీరు లేదు. జనులు హజ్రత్ అబూ బక్ర్ (రజి) దగ్గరకు వచ్చి, 'ఆయిషా(ర.అ) ఏం చేశారో తెలుసా? ఆమె నిర్వాకం మూలంగా దైవప్రవక్త(స) ఇక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. ఇంతమంది సహచరులు కూడా ఉన్నారు. కాని ఇక్కడ నీరు లేదు. వారి వద్ద కూడా నీరు లేదు' అని నిష్ఠూరంగా మాట్లాడారు.

అందువల్ల అబూబక్ర్ గుడారంలోనికి వచ్చారు. ఆ సమయంలో దైవ ప్రవక్త(స) నా తొడపై తన శుభప్రదమైన తలను ఆనించి నిద్రిస్తున్నారు. '(ఆయిషా!) నీ మూలంగా దైవప్రవక్త(స)తోపాటు ఇంతమంది సహాబా ఇక్కడ ఆగిపోవాల్సి వచ్చింది. చూడబోతే ఇక్కడ నీరు అన్నదే లేదు. సహాబా వద్ద కూడా నీరు లేదు' అంటూ అబూబక్ర్(రజి) నా మీద మండిపడ్డారు. దేవుడు తలచినన్ని గట్టి మాటలు నాకు వినిపించారు. కోపంతో నా పొట్టను గిల్లారు. ఆ నొప్పికి ఓర్చుకోలేక పోయాను. కాని ఏం చేసేది? దైవప్రవక్త(స) శుభప్రదమైన శిరస్సు నా తొడ మీద ఉంది. దైవప్రవక్త(స) గాఢ నిద్రలో ఉన్నారు. తెల్లవారింది. మరోవైపు నీరు లేదు. సరిగ్గా ఆ సమయంలోనే అల్లాహ్ 'తయమ్ముమ్' ఆజ్ఞను అవతరింపజేశాడు. అందరూ తయమ్ముమ్ చేసుకున్నారు. ఈ వెసులుబాటుపై ఉసైద్ బిన్ హుజైర్(రజి) ఇలా వక్కాణించారు : "ఓ అబూబక్ర్ కుటుంబీకులారా! మీ మూలంగా (ఉమ్మత్‌కు) ప్రాప్తమయిన మొదటి శుభం కాదిది". హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : నేను స్వారీ అయి వచ్చిన ఒంటెను లేపినప్పుడు, ఆ కంఠహారం అక్కడే లభించింది."[1]

**319)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) అబూబక్ర్, ఉమర్, ఉస్మాన్ (ర.అన్హుమ్)లను వెంటబెట్టుకుని ఉహుద్ పర్వతంపైకి ఎక్కినప్పుడు, అది వణకసాగింది. అప్పుడు దైవప్రవక్త(స) దానిని ఉద్దేశించి, "ఉహుద్! నెమ్మదించు. నీపైన ఒక దైవసందేశహరుడు, ఒక సత్యసంధుడు, ఇద్దరు అమరగతులు ఉన్నార"ని[1] పలికారు.

**322)** ఉర్వా బిన్ జుబైర్ తెలిపారు : నేను అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గారిని అడిగాను, మక్కాలోని బహుదైవారాధకులు దైవప్రవక్త(స) యెడల ఒడిగట్టిన అత్యంత అమానుషమైన చేష్ట ఏది? అని. దానికి ఆయన ఇలా తెలిపారు : ఉఖబా బిన్ అబీ ముఅయ్‌త్ దైవప్రవక్త(స)ను సమీపించటం నేను గమనించాను. ఆ సమయంలో ఆయన(స) నమాజ్ చేసుకుంటున్నారు. ఆ దౌర్భాగ్యుడు తన దుప్పటిని ఆయన(స) మెడలో వేసి లాగాడు. దాంతో ఆయన(స) మెడ ఆ దుప్పటిలో చిక్కుకుపోయింది. అంతలో అబూబక్ర్ వచ్చి, ఆ దౌర్భాగ్యుణ్ణి ఆ దుశ్చేష్ట నుంచి ఆపుతూ, "ఏమిటి, అల్లాహ్‌యే నా ప్రభువు అని చెబుతూ, మీ వద్దకు తన ప్రభువు తరపు నుండి స్పష్టమైన నిదర్శనాలను కూడా తీసుకువచ్చిన వ్యక్తిని నీవు చంపేయాలనుకుంటున్నావా?" అని మందలించారు.[1]

316-1. ఆ కంఠహారం అసలు అస్మా (ర.అ) ది. అందుకే హజ్రత్ ఆయిషా(ర.అ) మరింత చింతాగ్రస్తులయ్యారు. తరువాత దైవకృప వల్ల అది లభించింది. ఉసైద్ బిన్ హుజైర్(రజి) పలుకుల్లోని పరమార్థం ఏమిటంటే అబూబక్ర్ కుటుంబీకుల వల్ల ముస్లిం సముదాయానికి సదా ప్రయోజనమే చేకూరింది. ఈ హదీసు లోగడ 'తయమ్ముమ్' ప్రకరణంలో కూడా వచ్చింది. ఇక్కడ మళ్ళీ దీనిని పునరావృతం చేయటంలోని ఉద్దేశం హజ్రత్ అబూబక్ర్(రజి) విశిష్టతను చాటి చెప్పటమే.

319-1. సుబ్‌హానల్లాహ్! ఈ హదీసు కూడా మహాప్రవక్త(స) గారి అద్భుతాలకు దర్పణం వంటిది. ఆయన(స) వక్కాణించినట్లే మహనీయ ఉమర్ (రజి), మహనీయ ఉస్మాన్(రజి) వీర మరణాన్ని ఆస్వాదించారు. అబూబక్ర్ (రజి) గొప్పతనాన్ని చాటడం ఈ హదీసు ఉద్దేశం. ఉహుద్ పర్వతం వణకటం అనేది సత్యం. ప్రతి సృష్టి తన పరిమితుల్లో జీవన చైతన్యం కలిగి ఉంటుంది. ''ఆయన స్తోత్రంతో పాటు ఆయన పరిశుద్ధతను కొనియాడనిది ఏదీ లేదు'' (బనీ ఇస్రాయీల్ : 44)

322-1. పై హదీసుల ద్వారా మహనీయ అబూబక్ర్(రజి) విశిష్టత తెలిసి వస్తోంది.



# ఇస్లామ్ ప్రవక్త ప్రభవించే నాటికి ప్రపంచ ఆధ్యాత్మిక, నైతిక పరిస్థితి

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

## మహాప్రవక్త (స) ప్రభవించే నాటికి అరేబియా ధార్మిక, నైతిక పరిస్థితి

యమన్‌లో భారీ వరద వచ్చింది. దాని ఎత్తు నేల మట్టానికి 120 అడుగుల ఎత్తు ఉంది. ఆ వరదలో రాజధాని నగరంతో సహా పలుజిల్లాలు తుడిచిపెట్టుకు పోయాయి. ఇది క్రీ.శ. 2వ శతాబ్దిలో జరిగిన సంఘటన. ఈ వరదనే దివ్య ఖుర్ఆన్ 'ఇరమ్ వరద'గా పేర్కొంది. ఈ వరద ముంపు కారణంగా ఎనిమిది పెద్ద కుటుంబీకులు దేశం వదలి వివిధ ప్రదేశాలకు తరలి పోయారు. తత్ఫలితంగా రాజ్యవ్యవస్థ బలహీనపడింది. క్రీ.శ. 6వ శతాబ్దిలో అక్కడి పరిపాలకుడు, యూదు మతావలంబీకుడైన జోనవాస్‌పై ప్రజలు తిరుగుబాటు చేసి ఇథియోపియా రాజు సహాయం కోరారు. ఇథియోపియా రాజు క్రీ.శ. 509లో ఒక సైనిక దళాన్ని పంపాడు. ఆ సైనిక చర్య మూలంగా జోనవాస్ పదవీచ్యుతుడయ్యాడు. క్రీ.శ. 603లో ధైర్యశాలి, పరాక్రమ వంతుడైన జోయిజన్ పారసీకుల మద్దతుతో తన రాజ్యాన్ని తిరిగి కైవసం చేసుకున్నాడు. కాని కొన్నాళ్ళకే అతను హత్య గావించబడ్డాడు. ఆ తరువాత యమన్ పారసీక సామ్రాజ్యానికి లోబడిన ఒక సామంతరాజ్యంగా ఉండిపోయింది.

అంతకు ముందు యమన్ రాజ్యాన్ని విడిచిపోయిన తెగలలో ఒక తెగ 'హీరా'లో (ఇప్పుడది కూఫాగా ఉంది) ఒక రాజ్యస్థాపన చేసింది. అయితే అది పారసీకులకు లోబడి ఉండేది. తత్కారణంగా ఆ రాజ్య ప్రజలు జొరాస్ట్రియన్ మతానికి ప్రభావితులై ఉండేవారు. రెండవ తెగ సిరియా వెళ్ళి స్థిరపడింది. అది గస్సానీ వంశంగా పిలువబడేది. ఈ కుటుంబీకులంతా రోము సామ్రాజ్యానికి లోబడి ఉండటం వల్ల క్రమక్రమంగా వారంతా క్రైస్తవులుగా మారిపోయారు. ఇస్లాం ఆవిర్భవించే వరకూ వారు క్రైస్తవులుగానే ఉన్నారు.

మొత్తమ్మీద అరబ్బు సంస్కృతీ నాగరికతలపై పడిన అంతర్జాతీయ ప్రభావం వల్ల వారిలో చాలామంది మజూసీలుగా, నసరానీలుగా మారిపోయారు. యూదు విశ్వాసాల ప్రభావం కూడా వారిపై ఉండేది. ఎందుకంటే అరేబియా ద్వీపంలోని ఒక పెద్ద భూభాగం, ఉదాహరణకు: వాదియె ఖురా, ఖైబర్, ఫదక్‌లలోని జనాభా అంతా యూదులదే. స్వయంగా మదీనాలో కూడా అధికారం యూదుల చేతుల్లోనే ఉండేది. మిగతా అరబ్బు ప్రాంతాలలో మూఢనమ్మకాలు, బహుదైవోపాసనా భావాలు ఉండేవి. ప్రజలు విగ్రహాలను, రాళ్ళురప్పలను, చెట్టుపుట్టలను కొలిచేవారు. నక్షత్రాలను, దేవతలను, జిన్నాతులను పూజించేవారు.

## దేవునిపై నమ్మకం

అయితే అనాదిగా అరబ్బులు సర్వోన్నతుడైన దైవంపై నమ్మకం కలిగి ఉండేవారనటంలో సందేహం లేదు. ఇటీవల లభ్యమైన ప్రాచీన అరబ్బు శిలాఫలకాలపై 'అల్లాహ్' పేరు దేవుని అర్థంలోనే

వ్రాయబడి ఉంది. కాకపోతే అది 'అల్లాహ్' బదులు 'హల్లాహ్' అని ఉంది. నాబతీలుగా పిలువబడే ఉత్తర అరేబియా వాసుల పేర్లతో పాటు అల్లాహ్ పదం కూడా చేరి ఉండేది. ఉదాహరణకు: బైతుల్లాహి, అబ్దుల్లాహి. ఖుర్ఆన్‌లో స్వయంగా దేవుడు అవిశ్వాసుల గురించి ఇలా అంటున్నాడు:

**ఆకాశాలనూ, భూమినీ సృష్టించిన వారెవరు? అని నీవు వారిని అడిగితే, "అల్లాహ్" అని వారు తప్పకుండా అంటారు. "సమస్త స్తోత్రాలు అల్లాహ్‌కే శోభిస్తాయి" అని నీవు వారికి చెప్పు. *(లుఖ్మాన్ : 25)***

నిజానికి ఇది దైవప్రవక్త మహనీయ ఇబ్రాహీమ్ (అ) ప్రబోధనం. కాని కాలక్రమేణా బహుదైవారాధనా నమ్మకం పుట్టింది. అంటే మహోన్నతుడైన అల్లాహ్‌తో పాటు చిట్టిపొట్టి దైవాలు కూడా ఉన్నాయనీ, కాని అల్లాహ్ వారిలో అందరికన్నా గొప్పవాడని నమ్మసాగారు. ఈ నమ్మకం ఎంత గట్టిగా వ్రేళ్ళూనుకుందంటే, నిజ దైవాన్ని తిరస్కరించినప్పుడు ఎంత బాధ కలిగేదో అంతే బాధ చిల్లర దేవుళ్ళను తిరస్కరించినప్పుడు కూడా వారికి కలిగేది. పైగా వారి దృష్టిలో దైనందిన జీవితావసరాలు, ప్రాపంచిక కార్యకలాపాలు ఈ చిల్లర దేవుళ్ళ మూలంగా నెరవేరుతాయి. వారికి తరచూ అవసరం ఏర్పడేది ఈ చిట్టి పొట్టి దైవాలతోనే. అందుకే ఈ దైవాలనే వారు మొక్కేవారు. వాటి పేరిటే బలిదానా లిచ్చేవారు. అవసరాలు తీర్చమని వాటినే వేడుకునేవారు. అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించి వదిలేశాడనీ, అసలు తమ గోడు వినేది ఈ చిన్న చిన్న దైవాలేనని విశ్వసించేవారు. ఈ కారణంగానే ఎవరయినా అల్లాహ్ ఊసు ఎత్తితే జనుల ముఖాలపై అసహనం, చిరాకు కనిపించేది–

**ఒక్కడైన అల్లాహ్ గురించి ప్రస్తావించినప్పుడు, పరలోకాన్ని నమ్మని వారి గుండెలు అక్కసుతో ఉడికిపోతాయి. మరి అల్లాహ్ తప్ప ఇతరుల గురించి చెప్పినప్పుడు మాత్రం అవి ఆనందంతో విప్పారుతాయి. (అజ్ జుమర్ : 45)**

ఈ చిల్లర దేవుళ్ళను మొక్కుకుని, వాటి సమక్షంలో బలిదానాలు సమర్పించటం వల్ల పెద్ద దేవుడు ప్రసన్నుడవుతాడని వారు భావించేవారు. అంతేకాదు, చిట్టి పొట్టి దైవాలు పెద్ద దేవుని దర్బారులో తమ కొరకు సిఫారసు చేస్తారని కూడా వారు నమ్మే వారు.

**"ఈ పెద్దలు (విగ్రహాలు) మమ్మల్ని అల్లాహ్ సాన్నిధ్యానికి చేర్చటంలో తోడ్పడతారని భావించి మాత్రమే మేము వీళ్ళను ఆరాధిస్తున్నామ"ని వారంటారు. (అజ్ జుమర్ : 3)**

## దైవదూతల దైవత్వం

షిర్క్‌కి ఒడిగట్టడంతో పాటు మహోన్నతుడగు దేవుని గురించి వారికున్న మరో నమ్మకం ఏమిటంటే, ఆ దైవానికి భార్యాబిడ్డలు కూడా ఉన్నారు. వారు దైవదూతలను దేవుని కుమార్తెలని అనేవారు.

**పరలోకాన్ని నమ్మనివారు దైవదూతలకు ఆడవారి పేర్లు పెడతారు. (అన్ నజ్మ్ : 27)**

**"ఏమిటేమిటి? మీ కొరకేమో మగ పిల్లలూను, ఆయన కోసమేమో ఆడపిల్లలా? ఎంత అడ్డగోలు పంపకమిది!?"**
**(అన్ నజ్మ్ : 21, 22)**

యూదులు మహనీయ ఉజైర్ (అ)ను, క్రైస్తవులు మహనీయ ఏసుక్రీస్తు (ఈసా –అ)ను దైవంగా భావించినట్లే, వీళ్ళు కూడా దైవదూతలను దేవుని సంతానంగా భావించి, వారిని దైవత్వంలో భాగస్వాములుగా ఎంచేవారు.

**"మీరు దైవదూతలను, దైవప్రవక్తలను మీ ప్రభువులుగా చేసుకోండి" అని కూడా ఆయన మిమ్మల్ని ఆజ్ఞాపించటం లేదు." (ఆలి ఇమ్రాన్ : 80)**

**ఇంకా వాళ్ళు దైవదాసులలో కొందరిని దేవుని భాగం (దైవాంశం)గా చేశారు. నిజంగానే మానవుడు చాలా స్పష్టంగా కృతఘ్నతకు పాల్పడతాడు. ఏమిటి, అల్లాహ్ తాను సృష్టించిన వారిలో నుండి కూతుళ్ళను తన కొరకు కేటాయించుకుని, మీకేమో కొడుకులను ఇచ్చి సత్కరించాడా?**
**(అజ్ జుఖ్రుఫ్ : 15, 16)**

**కరుణామయుని (అల్లాహ్) దాసులైన దైవదూతలను వీళ్ళు ఆడువారుగా ఖరారు చేశారు. ఏమిటి, వారి పుట్టుక సందర్భంగా వీళ్ళుగాని అక్కడ ఉన్నారటనా? వీళ్ళ ఈ సాక్ష్యం వ్రాసుకోబడుతుంది. (దీని గురించి) వీరు తప్పకుండా ప్రశ్నించబడతారు. "కరుణామయుడు (అయిన అల్లాహ్) గనక తలచి ఉంటే మేము వాళ్ళను పూజించి ఉండేవాళ్ళం కాము" అని వారు చెప్పటం (కూడా వారి పెడసరితనానికి తార్కాణమే). (అజ్ జుఖ్రుఫ్ : 19, 20)**

వారిని అడుగు : నీవు ప్రభువుకు (కేవలం) కుమార్తెలూను, వారికేమో కుమారులా? పోనీ, మేము దైవదూతలను ఆడువారిగా సృష్టించినప్పుడు, వారు దానికి ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నారా? నిశ్చయంగా వీరివి అన్నీ అభూత కల్పనలే సుమా! అల్లాహ్‌కు సంతానముంది అని చెప్పి వారు అబద్ధమాడుతున్నారు. (అస్ సాఫ్ఫాత్ : 149 – 152)

దైవదూతలు దైవ సన్నిధిలో తమ కొరకు సిఫారసు చేస్తారని కూడా వారు నమ్మేవారు. దీనిని ఖండిస్తూ దేవుడిలా అంటు న్నాడు:

**ఆకాశాలలో ఎంతోమంది దైవదూతలు ఉన్నారు. కాని వాళ్ళ సిఫారసు ఏమాత్రం పనికి రాదు. కాకపోతే అల్లాహ్ తన ఇష్టంతో, తాను కోరిన వారి విషయంలో (సిఫారసు వినడా నికి) అంగీకరిస్తే అది వేరే విషయం. (అన్ నజ్మ్ : 26)**

ఈ ముష్రిక్కులు మిమ్మల్ని పూజించేవారా? అని ప్రళయదినాన దైవదూతలను దర్యాప్తు చేయటం జరుగుతుంది :

**"ఏమిటి, వీళ్ళు మిమ్మల్ని పూజించేవాళ్ళా?" అని దైవదూత లను అడుగుతాడు. (సబా : 40)**

### జిన్నాతుల దైవత్వం

దైవదూతల లాగానే వారు జిన్నాతులను కూడా దేవుని ప్రియతములుగా, సన్నిహితులుగా భావించేవారు. దేవునితో వారికి బాంధవ్యం ఉందని కూడా చెప్పేవారు –

**ఆఖరికి వారు అల్లాహ్‌కు–జిన్నాతులకు మధ్య కూడా బంధుత్వ సంబంధాన్ని కల్పించారు. (అస్ సాఫ్ఫాత్ : 158)**

అందుకే వారు జిన్నాతులకు దేవుని దైవత్వంలో భాగస్వామ్యం కల్పించేవారు –

**వారు జిన్నాతులను దేవుని భాగస్వాములుగా చేసుకున్నారు. కాగా, వారు దేవుడు సృష్టించిన జీవులు. జ్ఞానంతో నిమిత్తం లేకుండానే దేవుని కొరకు కొడుకులను, కూతుళ్ళను కల్పించు కున్నారు. (అల్ అన్ ఆమ్)**

వారు దేవుని బంధువులుగా, దేవుని భాగస్వాములుగా ఖరారై నప్పుడు వారి పూజలు, సేవలు కూడా అవశ్యమవుతాయి. అందువల్ల అజ్ఞాన కాలంలో అరబ్బులు ఈ జిన్నాతులను కూడా పూజించేవారు (సహీహ్ ముస్లిం – కితాబుత్తఫ్సీర్). అంతేకాదు, వారిలో చాలామంది వారిపైనే విశ్వాసం ఉంచేవారు. బాట సారులు దారిలో ఎక్కడయినా విడిది చేసినప్పుడు, జిన్నాతుల శరణు కోరేవారు. కొందరైతే వారి పేరిట జంతువులను బలి ఇచ్చేవారు. ఖుజాఅ తెగకు చెందిన ఒక కుటుంబీకులు ప్రత్యేకంగా జిన్నులనే పూజించేవారు. కల్బీ ప్రకారం క్రింది వారిని దృష్టిలో పెట్టుకునే ఈ ఆయత్ అవతరించింది :

**అల్లాహ్‌ను కాదని మీరు మొరపెట్టుకుంటున్న వారంతా మీలాంటి దైవదాసులే సుమా! (అల్ ఆరాఫ్ : 194)**

*(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వీ–రహ్మ– విరచితమైన 'సీరతున్నబీ' పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)*

**(మిగతా వచ్చే సంచికలో)**

# కొత్త తునకలు-4

## - ఎస్.ఎమ్. మలిక్

1) కడచిన దానికి క్షంతవ్యానుభూతి అభివ్యక్తి
ఓ మహా మంత్రం!
కరుడు గట్టిన భీకర ఆందోళనల పునాదుల్ని
కదిలించి వేస్తుంది!!

2) వాగ్దానాలు చేయడం కాదు
మాట నిలబెట్టుకోవడం గొప్ప!
పరిస్థితులు ఎలా ఉంటాయో?
వాగ్దానాలు మానివేశాను!!

3) విజయం సాధించిన తల, రొమ్ము విరుచుకు వస్తే
అలా నవ్వేశాను!
కష్టార్జిత స్వేదం నుదుట, వినమ్రత దర్శనమిచ్చింది
తల వంచేశాను!!

4) ఎన్నయినా రచించుకుని ప్రయోగాలు చేద్దాము
కాలం తోడ్పాటునిస్తే చాలు!
ఓ పథకం నీరుగారిపోతే పోయింది, ఫరవాలేదు
పథకాల రచయితలం మనమే!!

5) చంద్రుడు లేని వినీల గగన క్షితిజం నుంచి క్షితిజం
తారలతో ఎంత శోభ! ఎంత కొరత!
జీవితం ఎంత శోభాయమానం అయినా ఒకే ఒక్క
బింబ లోపభూయిష్టం అనూహ్యం!!

6) నా ప్రశాంతతను మెల్లి మెల్లిగా
కొల్ల గొడుతున్నావు, ఎందుకు?
నిన్ను వెతలలోన వెతికి వెతికి
వెలికి తీయడం అపరాధమా??

# కారుణ్యమూర్తి ముహమ్మద్ ప్రవక్త (స) పై కవి సమ్మేళనం





**ముహమ్మద్ ప్రవక్తపై** కవి సమ్మేళనంలో ముస్లిం కవులు, కవయిత్రుల కన్నా హిందువులుగా జన్మించిన తెలుగు కవులు అధిక సంఖ్యలో పాల్గొనటం ఈ సభకున్న ఒక విశేషమని నాళేశ్వరం శంకరం అన్నారు. మతోన్మాదం వెయ్యికాళ్ళ జెర్రిలాగా విస్తరిస్తున్న సందర్భంలో సమైక్య భావనకు ముగ్గు పోస్తున్న ఇలాంటి సభల అవసరం ఎంతో ఉందన్నారు. ముహమ్మద్ ప్రవక్త(స) జీవితం ప్రభోధాత్మకమైందని, తన ఇంటి దీపానికి తగినంత చమురు కూడా లేక పోయినా 'సమస్త ప్రజల హృదయాలలో ప్రేమ అనే చమురుతో జీవితాంతం ప్రేమజ్యోతిని వెలిగించిన వారని ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం చెప్పారు.

తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్టార్ మాట్లాడుతూ మిలాద్ ఉన్నబి సందర్భంగా విశ్వ కారుణ్యమూర్తి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనం మత సామరస్యానికి ప్రతీక అన్నారు.

మహమ్మద్ ప్రవక్త ఎంతో దయామయులని, ఆయన అనాగరికులయిన అరబ్బులను క్రమశిక్షణ నేర్పారని, పశువుల కాపరులను గవర్నర్లుగా చేశారని ఆయన సత్యసంధత వల్ల, నిజాయితీ వల్ల ప్రజలు ఎంతో ప్రభావితులై ఆయన ప్రతి మాటను నమ్మి విశ్వాస వంతులయ్యారని అన్నారు.

కళా రత్న బిక్కికృష్ణ మాట్లాడుతూ విశ్వకారుణ్యమూర్తి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి మిలాద్ ఉన్న బి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కవి సమ్మేళనానికి రెండు రాష్ట్రాల నుండి 100 మంది కవులు, కవయిత్రులను ఆహ్వానించి కవి సమ్మేళనం నిర్వహించడం మామూలు విషయం కాదు. అందుకు అబ్దుల్ రషీద్ గారిని అభినందిస్తున్నాను అన్నారు. అబ్దుల్ రషీద్ గారు వాట్సాప్ ద్వారా ఇస్లాం గురించి రాస్తున్న విషయాలు చదివినప్పుడు దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఎంత దయామయులో కరుణామయులో తెలిసిందన్నారు.

ఈ కవి సమ్మేళనంలో నిజామాబాద్ కు చెందిన కవి రచయిత తొగర్ల సురేష్ గారు రచించిన ఒక కొమ్మకు పూసిన... పుస్తకాన్ని కళా రత్న బిక్కికృష్ణ గారు ఆవిష్కరిస్తూ ఈ ధార్మిక సభలో సురేష్ గారు తన పుస్తకాన్ని ఆవిష్కరింప చేయడం మతసామరస్యానికి మచ్చుతునక అన్నారు.

సినీ గీత రచయిత డా. సాధనాల వెంకటస్వామి నాయుడు మాట్లాడుతూ, ఇంత మంచి కవి సమ్మేళనానికి నన్ను ఆహ్వానించినందుకు అబ్దుల్ రషీద్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఉదయం 10 నుండి సాయంత్రం 6:30 వరకు నిరంతరాయంగా కొనసాగిన ఈ కవి సమ్మేళనం మరువలేని మధురానుభూతి అని చెప్పారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంగ్లానువాదకులు మంతెన దామోదరాచారి ఒక సెషన్‌కు అధ్యక్షత వహించారు. విశ్వకారుణ్యమూర్తి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఆయనను అనుసరించే వారు ధన్యులని తమ ప్రసంగంలో పేర్కొన్నారు.

కవయిత్రి, గేయ రచయిత్రి గిడుగు కాంతి కృష్ణ, మేటివేషనల్ స్పీకర్ డాక్టర్ ఆలపాటి, కవి, జర్నలిస్ట్ మోటూరి నారాయణరావు తదితరులు ప్రసంగించారు.

ఇదార అదబ్ ఇస్లామీ హింద్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. అధ్యక్షులు జనాబ్ షుఅయ్ బ్ ఉల్ హఖ్ తాలిబ్ పర్యవేక్షకులుగా పాల్గొన్న ఈ కవి సమ్మేళనంలో ఇదార అదబ్ ఇస్లామీ హింద్ జాతీయ ఉపాధ్యక్షులు సౌత్ ఇండియా, ఖాజా మసీహ్ ఉద్దీన్ అబూ నబీల్ సమన్వయకర్తగా వ్యవహరించారు. జమాతె ఇస్లామీ హింద్ తెలంగాణ రాష్ట్ర సలహా మండలి సభ్యులు జనాబ్ సాదిక్ అహ్మద్ విశ్వ కారుణ్యమూర్తి ముహమ్మద్ సల్లల్లాహు సల్లం గారి జీవిత చరిత్రపై ప్రసంగించి సభికులను అలరించారు. ఈ కవి సమ్మేళనానికి కన్వీనర్ గా ముహమ్మద్ అబ్దుల్ రషీద్ వ్యవహరించారు.

★★★




**ముహమ్మద్ రఫీఖ్**

**తెలంగాణ** రాష్ట్రంలో కొంతకాలంగా కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతోంది. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీల బస్సు యాత్ర అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్ల సానుకూలత మరింత పెరిగింది అనేది వాస్తవం. ఇండియా టుడే- సీ ఓటర్ సర్వే కూడా కాంగ్రెస్ ముందంజలో ఉన్నట్లు తేల్చింది. తాము అధికారంలోకి రాబోతున్నామని డిసెంబర్ 9న ప్రమాణ స్వీకారం అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు. సీఎం రేస్‌లో నేనంటే నేనని సీనియర్ నాయకులు ప్రకటించుకుంటున్నారు. కాంగ్రెస్‌లో జరుగుతున్న ఈ హడావుడిని చూసినా, తెలంగాణ రాజకీయ ముఖచిత్రం చూసినా, వివిధ సర్వేలు, పత్రికల సంపాదకీయాలు చూసినా కాంగ్రెస్ పట్ల సానుకూలత పెరిగిందనే విషయం స్పష్టమవుతోంది. అయితే ఇల్లు అలకగానే పండుగ కాదని కాంగ్రెస్ పార్టీ గుర్తుంచుకోవాలి. 2022 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీకి గణనీయంగా ఓట్లు, సీట్లు పెరిగాయి కానీ అధికారం రాలేదు. 2020లో బీహార్ ఎన్నికల్లో తేజస్వీ యాదవ్ నేతృత్వంలోని ఆర్‌జేడీ కూడా కాంగ్రెస్‌తో జతకట్టి ఓట్లు, సీట్లు సాధించింది కానీ అధికారం తృటిలో తప్పింది. తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ పట్ల క్రమంగా ఏర్పడుతున్న సానుకూలత సీట్లుగా మారి అధికారం దక్కుతుందా? లేదా ఓట్లు, సీట్లు పెంచుకుని అధికార పీఠానికి దూరంగా నిలిచిపోతుందా అనేది వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది.

### ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలే అవకాశం?

రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీతో పాటు జనసేన, బీఎస్పీ, షర్మిల పార్టీలు కూడా పోటీ పడే అవకాశముంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఇన్ని పార్టీల మధ్య చీలిపోతే అధికార పక్షానికే మేలు జరిగే అవకాశముంది. కాబట్టి అధికారంలోకి రావాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ కానీ, బీజేపీ కాని పాలక పార్టీకి తామే ప్రత్యామ్నాయం అనే భావన ప్రజల్లో కల్పించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు, రైతు బంధు, మైనార్టీ బంధు, బీసీ బంధు పథకాల పట్ల ప్రభుత్వ సానుకూలత కన్నా వ్యతిరేకతే ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. సామాజిక పెన్షన్లు పొందుతున్న వృద్ధులు, వికలాంగులు మినహా విద్యార్థి, యువత, ఉద్యోగ వర్గాల్లో వ్యతిరేకత తప్పక ఉంటుంది. వీరి ఓట్లు పార్టీల మధ్యన చీలిపోతే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం కలగవచ్చు. అధికార పక్షాన్ని వెంటనే గద్దె దింపాలన్న కసి ప్రజల్లో ఉన్నదా లేదా రాబోయే కొద్దిరోజుల్లో తేలుతుంది.

## ముస్లింలు ఎటువైపు?

సాధారణంగా 2014, 2018 ఎన్నికల్లో ముస్లింలు బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్)కు మద్దతు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో సఖ్యతగా ఉంటూ వస్తోంది. పలు కీలక నిర్ణయాలలో కేంద్ర ప్రభుత్వానికి మద్దతు నిచ్చింది. ఈ నేపథ్యంలో ముస్లింలలో బీఆర్ఎస్ వైఖరి పట్ల కాస్త అనుమానం ఉన్నమాట వాస్తవమే. అదే సమయంలో షాదీ ముబారక్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ల పట్ల కొంత సానుకూలత కూడా ఉంది. బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల మధ్య ఉన్న స్నేహం ముస్లిం ఓటర్లపై ఎంతో కొంత ప్రభావం చూపే అవకాశముంది. గతేడాది కర్ణాటక ఎన్నికల్లో ముస్లిం ఓటర్లు మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీవైపు నిలిచారు. అయితే కర్ణాటకకు, తెలంగాణకు కొంత వ్యత్యాసముంది. అక్కడ కాంగ్రెస్ బీజేపీలు నేరుగా తలపడ్డాయి. కాబట్టి ముస్లింలు కాంగ్రెస్ పార్టీ వైపు నిలిచారు. తెలంగాణలో ఆ పరిస్థితి లేదు. బీజేపీ నామమాత్రంగా ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యన ఉండబోతోంది. కాబట్టి ముస్లింల వైఖరి ఎలా ఉండబోతోంది అన్నది ప్రధాన అంశం కానున్నది. ముస్లింలు కనీసం 40 స్థానాల్లో నిర్ణాయక శక్తిగా ఉన్నారు. అయితే ఇటీవల ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణ పర్యటనకు వచ్చిన సమయంలో కేసీఆర్ ఎన్డీఏలో చేరడానికి ప్రయత్నించినా మేము చేర్చుకోలేదు అనే వ్యాఖ్య ముస్లింలలో బీఆర్ఎస్ వైఖరిపై అనుమానాలు బలపడుతున్నాయి. దీంతో ముస్లింలు తమ వైపే ఉంటారని కాంగ్రెస్ పార్టీ బలంగా నమ్ముతోంది.

## థర్డ్ పార్టీ చీల్చే ఓట్లే కీలకం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ముఖాముఖి తలపడే సీట్లలో మూడో స్థానంలో ఉండే బీజేపీ ఎన్ని ఓట్లను చీల్చగలుగుతుందనే దానిపై గెలుపోటములు ఆధారపడి ఉంటాయి. దీనికి దుబ్బాక, హుజూర్‌నగర్, నాగార్జున్‌సాగర్, హుజూరాబాద్ ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనం. కాంగ్రెస్ పార్టీ నామమాత్రంగా ఉన్న దుబ్బాక, హుజూరాబాద్‌లలో బీజేపీ గెలిచింది. బీజేపీ నామమాత్రంగా ఉన్న నాగార్జునసాగర్, మునుగోడులో బీఆర్ఎస్ గెలిచిన విషయం తెలిసిందే. రాబోయే సాధారణ ఎన్నికల్లో కూడా మూడో పార్టీ చీల్చే ఓట్లపైనే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల గెలుపోటములు ఆధారపడి ఉంటాయి.

## కాంగ్రెస్‌కు నష్టం చేసేలా బీజేపీ వ్యూహాలు

దేశంలో, ఏ రాష్ట్రంలోనైనా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకూడదనే బీజేపీ బలంగా కోరుకుంటుంది. తాము నామమాత్రంగా ఉన్న చోట్ల ప్రాంతీయ పార్టీ గెలిచినా ఫర్వాలేదు కానీ కాంగ్రెస్ పార్టీ గెలువకూడదనేది బీజేపీ వ్యూహంగా ఉంటుంది. బీజేపీ మొదటి లిస్ట్‌లో ప్రకటించిన అభ్యర్థులను చూసినా ఈ వ్యూహం దాగుందనే అనుమానం కలుగుతోంది. బీజేపీ ప్రకటించిన మొదటి లిస్ట్‌లో చాలామంది అభ్యర్థులు ప్రజల్లో పలుకుబడి, విజిబులిటీ ఉన్న నాయకులే ఉన్నారు. బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, సోయం బాపురావు, తల్లోజు ఆచారి, రాణి రుద్రమరెడ్డి తదితరులు మొదటి, రెండవ స్థానాల్లో ఉండగలిగే స్థాయి ఉన్నవారు. వీరు గెలిచినా గెలవవచ్చు, గెలవక పోయినా భారీగా ఓట్లు చీల్చి కాంగ్రెస్‌కు నష్టం కలిగించవచ్చు. ఉదాహరణకు గజ్వేల్‌లో ఈటెల రాజేందర్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. గజ్వేల్‌లో ముదిరాజ్‌లు పెద్దసంఖ్యలో ఉన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముదిరాజ్‌లలో అసంతృప్తి ఉన్నదనే ప్రచారం ఉంది. కేసీఆర్‌తో కాంగ్రెస్ ముఖాముఖి తలపడినప్పుడు ముదిరాజ్‌ల ఓట్లు కాంగ్రెస్ వైపు మళ్ళే అవకాశముంటుంది. కాబట్టి ఈటెల రాజేందర్ పోటీలో ఉండడం వల్ల ముదిరాజ్‌ల ఓట్లు బీజేపీ వైపు మళ్ళి కేసీఆర్ గెలుపు సునాయాసం అవుతుందనే ప్రచారం కూడా ఉంది. బీజేపీ నాయకత్వం ఇలాంటి స్ట్రాటజీని రాష్ట్రమంతటా అమలు చేయబోతు న్నది అనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

## ప్రత్యామ్నాయ శక్తిగా కనబడాలి

రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు తామే ప్రత్యామ్నాయం అన్న నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో కలిగించ గలగాలి. దానికితోడు కేసీఆర్ ప్రభుత్వాన్ని తక్షణమే గద్దె దింపాలన్న తీవ్రమైన వ్యతిరేకత ప్రజల్లో కనబడుతున్నదా అనేది కూడా ముఖ్యమైన విషయమే. ప్రజల్లో సానుకూలత ఉన్నంత మాత్రాన అధికారం దక్కదు.. దానికి పరిస్థితులు కూడా కలిసి రావాలి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చిన పార్టీకి రెండుసార్లు అవకాశమిచ్చారు... ఇచ్చిన పార్టీకి కూడా ఒకసారి అవకాశం ఇవ్వండి అనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉంది. అలాంటి వాతావరణాన్ని ప్రజల్లో కల్పించగలగాలి. కాంగ్రెస్ పార్టీ ఈ దిశలోనే వ్యూహరచన చేస్తోంది కూడా.

ఇంతకీ రేవంత్‌రెడ్డి పెట్టిన ముహూర్తం శుభ ముహూర్తమో కాదో డిసెంబర్ మొదటి వారంలో తేలిపోనున్నది. శకునాలు చూసి ఎలక్షన్‌లలో పోటీ చేసే అభ్యర్థులంతా గెలవటం సంభవం కాదు. రాష్ట్ర ఓటరు ఓడిపోకుండా ఉంటే అదే పదివేలు.

## దేశ సమైక్యతను, సంక్షేమాన్ని కాంక్షిస్తూ...

# శాంతి సందేశం



**- అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ**

**గౌరవనీయులైన పెద్దలారా, అభిమాన సోదర సోదరీమణులారా...!**

భౌగోళికంగా మనం భారతీయులం. భారతదేశం మన మాతృ భూమి. భారతీయులందరూ పరస్పరం సోదరులు. చట్టం దృష్టిలో అందరూ సమానులు. కుల వ్యవస్థ, అంటరాని తనం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. దేశ విశిష్టతకు దేశ సమగ్రతకు కళంకం.

పుట్టుక రీత్యా భూమిపై నివసించే మానవులందరూ ఒకే దేవుని దాసులు. ఆదిమానవులైన ఆదాం హవ్వాల సంతానం. ప్రపంచ మానవులందరూ పరస్పరం సోదరులు.

దేశం ఏదైనా, భాష ఏదైనా, మతం ఏదైనా, రూపురేఖలు వేరైనా, నల్లవారైనా తెల్లవారైనా, ధనవంతులైనా, పేదవారైనా, అందరి రక్తం ఒక్కటే. పుట్టుకతో ఎవరూ కులీనులు కారు, కులహీనులు కారు. ఇది శాస్త్రీయ సత్యం.

కనుక మానవుల మధ్య కుల మతభేదభావాలు ఉండకూడదు. అంటరానితనం ఉండకూడదు. జాత్యహంకారం ఉండకూడదు. వర్గ దురభిమానాలు ఉండకూడదు.

అందరూ కలిసిమెలిసి జీవిస్తేనే జీవితాలలో సుఖ సంతోషాలు ఉంటాయి. దేశంలో సమాజంలో శాంతిభద్రతలు ఉంటాయి.

**దేశ ప్రజలారా...!**

కుల మత భాష ప్రాంతాలు చూడకుండా మనం పెద్దలను గౌరవించాలి. వారి పట్ల మర్యాదగా మెలగాలి. అసభ్యకరమైన మాటలతో చిలిపి చేష్టలతో పెద్దల మనసును నొప్పించకూడదు.

పెద్దలను గౌరవించని వారికి సభ్య సమాజంలో గౌరవం ఉండదు.

**దేశ వాసులారా...!**

కుల మతాలకు అతీతంగా పిల్లలను ప్రేమించాలి.పిల్లల క్షేమాన్ని కోరాలి. వారి ప్రగతి కోసం పాటుపడాలి. వారి పట్ల మృదువుగా మెలగాలి. పిల్లలు పెద్దల ఆశాజ్యోతులు! మన దేశ భవిష్యత్తు!!

కనుక పిల్లలకు నైతిక విలువలతో కూడిన ఉన్నత విద్య ఇవ్వాలి.

పంట రక్షణ కోసం కలుపు మొక్కలను తొలగించినట్లు పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం, శాంతియుత సమాజ నిర్మాణం కోసం మాదక ద్రవ్యాల నుండి, మత్తు పదార్థాల నుండి, డ్రగ్స్ మహమ్మారి నుండి, లైంగిక విచ్చలవిడితనం నుండి కాపాడ టానికి పెద్దలు చిత్తశుద్ధితో ప్రయత్నించాలి.

**దేశ ప్రజలారా...!**

స్త్రీమూర్తిని ఆదరించాలి. స్త్రీమూర్తి మానాన్ని కాపాడాలి. వరకట్న కాళ నాగుల నుండి, కామాంధుల కీడు నుండి స్త్రీమూర్తికి రక్షణ కల్పించాలి.

**స్త్రీ మూర్తి** - నవ మాసాలు కడుపులో మోసి కని పెంచి పోషించిన మహాతల్లి!

**స్త్రీ మూర్తి** - సుఖదుఃఖాలలో పాలుపంచుకునే జీవన సహ ధర్మచారిణి!

**స్త్రీ మూర్తి** - ఒడిలో అల్లారు ముద్దుగా పెరిగిన ముద్దుల కూతురు!

**స్త్రీ మూర్తి** - అన్నదమ్ముల క్షేమాన్ని కాంక్షించే చెల్లి!

**స్త్రీ మూర్తి** - ఇంటికి దీపం!

**స్త్రీ మూర్తి** - జగతికి జీవనజ్యోతి!

స్త్రీ మూర్తిని ఆదరించని దేశానికి గౌరవించని సమాజానికి మనుగడ ఉండదు, వినాశనం తప్పదు అన్నది జగమెరిగిన సత్యం.

### జీవితం క్షణ భంగురం

దేశ వాసులారా...!

ఈ జీవితం శాశ్వతం కాదని, మరణం తథ్యం అని, అది ఎప్పుడు సంభవిస్తుందో చెప్పలేము అని, మరణం సంభవిస్తే... రక్త సంబంధీకుల్లో ఎవరూ మన వెంట రారు అని మన ఆస్తిపాస్తులు సంపదలు వెంట రావు అని అందరికీ తెలుసు.

దేవుడు ఉన్నాడని నమ్మితే ఆ దేవుని సన్నిధిలో మనమందరమూ హాజరు కావలసి ఉందని, సర్వమూ తెలిసిన ఆ దేవుడు మన కర్మల లెక్క తీసుకుంటాడని, తీర్పుదినం ఉందని, ఆ రోజు సజ్జనులకు శాశ్వత స్వర్గం ప్రాప్తిస్తుందని, దుర్మార్గులు నరకంలో పడవేయబడతారని హేతుబద్ధంగా విశ్వసించక తప్పదు.

### హెచ్చరిక

ప్రజానాయకులు ప్రజా ప్రతినిధులు.

స్వార్థ ప్రయోజనాల కోసం, అధికారం అంతస్తుల కోసం, బూటకపు గౌరవం గుర్తింపు కోసం, దేశ ప్రజల మధ్యన చిచ్చు పెట్టకూడదు. మతకలహాలను సృష్టించకూడదు.

జాతీయ సంపదను ప్రభుత్వ ఆసుల్ని ధ్వంసం చేయకూడదు. ప్రజల నివాసాలను దహనం చేయకూడదు. దుకాణాలను తగలబెట్టకూడదు.

నిరపరాధులపై బలహీనులపై దాడి చేయకూడదు.

దేశ ప్రజల బ్రతుకుల్ని బజారుపాలు చేయకూడదు.

స్త్రీమూర్తి కాపురంలో కలతలు రేపకూడదు.

పసి పిల్లలను అనాథలుగా, దిక్కులేని వారుగా చేయకూడదు.

ముసలి తల్లిదండ్రులను నిస్సహాయులుగా చేయకూడదు.

పీడితుల ఆక్రందనలకు భయపడాలి.

### బాగా తెలుసుకోండి!

మానవత్వాన్ని మరిచి, క్రూర మృగంగా మారి సాటి మనిషిని పీడించే వారిని,హింసించే వారిని, కొంపల్ని కూల్చే వారిని, ఆ నిజ దేవుడు- సృష్టికర్త విశ్వ ప్రభువు సర్వశక్తుడు న్యాయ శీలుడు- క్షమించడు. మరణానంతరం తీర్పుదినాన తప్పకుండా కఠినంగా శిక్షిస్తాడు. కనుక అప్రమత్తంగా మసలుకోవాలి.

రండి! మనమందరం- చిన్నిల్లు అంటే మన నివాసం, పెద్దిల్లు అంటే మన దేశంలో ప్రశాంతంగా ఆనందంగా గౌరవంగా సురక్షితంగా జీవిద్దాం. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం.

మన దేశాన్ని శాంతి నిలయంగా తీర్చిదిద్దుదాం.

జీవిత మాధుర్యాన్ని ఆస్వాదిద్దాం. కుటుంబ సభ్యులు దేశ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోదాం

## మంచితనానికి మానవతకు ముఖ్యమైన విలువలు!

అన్ని జన్మలకన్నా మానవ జన్మ ఉన్నతమైనది, ఉత్కృష్టమైనది. మంచితనానికి మానవతకు మారుపేరు మనిషి. ఈనాడే కాదు ఏనాడైనా ఏ సమాజంలోనైనా మనిషి పెంచుకోదగినవి, పదిలంగా నిలుపుకోదగినవి మూడే విలువలు.

**మొదటిది :** స్వేచ్ఛా చింతన. స్వేచ్ఛా చింతనతోనే మానవుడు ఆటవిక దశ నుండి అణుయుగ దశ వరకు ఎదిగి ఆధునిక మానవునిగా పరిణతి చెంది సృష్టి రహస్యాలను ఛేదించగలుగుతున్నాడు. ఈ క్రమంలో తన గమనానికి అడ్డు వచ్చే అనేక బంధాల్ని అధిగమించి స్వేచ్ఛాపథంలో నిరంతర ప్రస్థానం సాగిస్తూ సృష్టికి ప్రతి సృష్టి చేయగలుగుతున్నాడు.

**రెండవది :** సహజమైన సౌజన్యం, మంచితనం. పది మంది బాగు కోసం ఆలోచించటం, పది మంది బాగులోనే తన బాగుందనుకోవటం... పది మంది అభ్యుదయంలోనే తన అభ్యుదయం ఉందనుకోవటం. మంచితనం ఉన్న మహానుభావులే తమలోని స్వార్థాన్ని త్యజించి ఎన్నో కష్టనష్టాల్ని ఎదుర్కొని సమాజాన్ని ముందుకు నడపగలగాలి.

**మూడవది :** మంచి అభిరుచి. ఒక మంచి భావానికి, శ్రావ్యమైన గానానికి ఒక సుమనోహర దృశ్యానికి అప్రయత్నంగా సహజంగా స్పందించటం. ఈ స్పందించే గుణం మంచి అభిరుచికి మూలం. అంతేకాదు స్పందించే గుణం వ్యక్తిని సమాజంలోని సమస్యలకు, సాటి మనిషి కష్టాలకు కన్నీళ్ళకు కూడా కరిగింపచేసి మనిషిగా తన వంతు కర్తవ్యాన్ని గుర్తించేటట్లు చేస్తుంది.

ఈ మూడు విలువలు మనిషిని మనిషిగా మార్చే విలువలు. మనిషిలోని మానవతను పెంచి మనిషికి పరిపూర్ణతనిచ్చే విలువలు. ఉన్నతమైనది, ఉత్కృష్టమైనది అనిపించుకున్న మానవ జన్మ కలిగినందుకు అందరికీ ఉపయుక్తమైన పనులు చెయ్యడానికి శ్రద్ధ చూపాలి. అప్పుడే మానవ జన్మకు అర్థం, పరమార్థం.

**- పోలంకి విజయభాస్కర్**

# పాలస్తీనా- ఇస్రాయీల్ సమస్య

- డా॥ ముహమ్మద్ హసన్

**"మూడవ ప్రపంచ యుద్ధం** అంటూ వస్తే దాని చరిత్రను రాయడానికి ఎవరూ ఉండరు" అంటాడు ప్రముఖ రాజనీతి తత్వవేత్త ఆర్నాల్డ్ టోంబీ. అమెరికా- రష్యా దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం తొలగిపోయిన తర్వాత ఏక ధ్రువ ప్రపంచం ఆవిర్భావించింది. ఫలితంగా అమెరికా, దాని మిత్రదేశాలు పాతకాలపు సామ్రాజ్యవాద సిద్ధాంతాలను తిరిగి ప్రపంచ దేశాలపై నయా పెట్టుబడిదారి విధానాన్ని సాగిస్తు చిన్నా చితకా దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకొని ఆ దేశాలపై ప్రత్యక్షంగా పరోక్షంగా పెత్తనం చెలాయిస్తున్నాయి. అమెరికా అరబ్ దేశాల మధ్య ఇజ్రాయిల్‌ను వెనుకేసుకుంటూ సైనికంగా ప్రోత్సహిస్తు అరబ్ దేశాలను బలహీనపర్చాలని చూస్తోంది. "హమాస్" తిరుగుబాటు దారులు ఇజ్రాయిల్‌పై మూకుమ్మడిగా సుమారు 5500 రాకెట్లు ప్రయోగించి "ఆపరేషన్ అల్ అక్సా" పేరుతో ఇజ్రాయిల్‌ను, దాని రక్షణ వ్యవస్థను సవాలు చేశారు. ఇజ్రాయిల్‌ను యుద్ధానికి ఆహ్వానించారు. ఈ సంఘటనతో ఇజ్రాయిల్ తో పాటు ప్రపంచం మొత్తం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. "హమాస్" తిరుగుబాటు దారుల వద్ద బందీలుగా వున్న ఇజ్రాయిల్ పౌరులను విడిపించ డానికి "ఆపరేషన్ ఐరన్ స్వార్డ్" పేరుతో ఇజ్రాయిల్ సైన్యం రంగంలోకి దిగింది. దాని ఫలితమే గత మూడు వారాలుగా హమాస్ తిరుగుబాటుదారులకు, ఇజ్రాయిల్ సైన్యానికి మధ్య భీకర యుద్ధం. పాలస్తీనా ఇజ్రాయిల్ యుద్ధం విషయానికి వస్తే ఇజ్రాయిల్‌కు అగ్రరాజ్యమైన అమెరికా మొదటి నుండి సైనికంగా, సాంకేతికంగా, రాజకీయంగా వెనకేసుకుంటు ప్రోత్సహిస్తున్న విషయం తెలిసినదే. ఇజ్రాయిల్- పాలస్తీనాల మధ్య సమస్యను అమెరికా, దాని మిత్రదేశాలు పాలస్తీనాను భౌగోళికంగా గుర్తించ కుండా కేవలం ఇజ్రాయిల్ ను మాత్రమే భౌగోళికంగా గుర్తిస్తూ 1948లో ఐక్యరాజ్య సమితిలో ప్రకటన చేయించటం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఇజ్రాయిల్‌తోపాటుగా పాలస్తీనాను కూడా భౌగోళికంగా గుర్తించి ఆ దేశానికి ప్రపంచ దేశాలతో పాటు రాజకీయ భాగస్వామ్యం, ఆర్థిక సహకారం, అంతర్జాతీయ సంబంధాలు పెంపొందే విధంగా అప్పుడే కృషిచేసి వుంటే ఈనాడు ఈ యుద్ధం జరిగేదే కాదు. వారి నిర్లక్ష ఫలితమే నేడు ఇజ్రాయిల్ పాలస్తీనా యుద్ధం. ఇజ్రాయిల్ దేశం ఏర్పడిన తర్వాత పాలస్తీనా ఇజ్రాయిల్ పై యుద్ధం ప్రకటించటం, పాలస్తీనా ఓడిపోవటం, పాలస్తీనా ప్రజల్లో అసంతృప్తి, ఆవేశం గూడు కట్టుకొని ఉండటం క్రమంగా పెరిగింది.

ఈ డెబ్బై సంవత్సరాల కాలంలో ఈ హింస ఏ స్థాయికి వెళ్ళిందంటే 1974 అక్టోబర్ -06న అరబ్- ఇజ్రాయిల్ యుద్ధానికి దారి తీసింది. ఆరు అరబ్‌దేశాలు పాలస్తీనాకు మద్దతుగా ఇజ్రాయిల్‌తో యుద్ధంలో పాల్గొన్నాయి. కాని అమెరికా మద్దతుతో కేవలం ఆరు రోజులలోనే ఇజ్రాయిల్ అరబ్ దేశాలపై విజయం సాధించింది. 1974 తర్వాత ఐక్యరాజ్య సమితి గాని దాని మిత్ర దేశాలు గాని ఆనాడే సమస్యను గుర్తించి పాలస్తీనా సమస్యను ప్రపంచ శాంతి భద్రతల సమస్యగా పరిగణించి పరిష్కరించకపోవటం మరొక చారిత్రాత్మక తప్పిదం. సెంటు భూమి కోసం కొట్లాడుకొని హింసకు పాల్పడుతున్న నేటి రోజుల్లో తమ భూభాగం, తమ ఆధీనంలో లేకపోవటం, పైగా ఇజ్రాయిల్ అధికారుల అనుమతి తీసుకొని రావాల్సివుండటం తనిఖీల పేరుతో పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ సైన్యం ఇబ్బంది పెట్టడం ఈ ఏడు దశాబ్దాలుగా వారు అనుభవిస్తు వస్తున్నారు. గాజాలోని "అల్ అక్సా" మసీదులోకి వెళ్ళాలంటే కూడా ఇజ్రాయిల్ పోలీసుల అనుమతి తీసుకొని రావాల్సి ఉండటం వారికి అత్యంత బాధ కల్గించిన విషయం. ఈ క్రమంలోనే పాలస్తీనా లిబరేషన్ ఫ్రంట్ ఆవిర్భావం, అలాగే పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా ఆవిర్భావం, పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ మొదలైన సంస్థలన్నీ పాలస్తీనా భౌగోళిక, రాజకీయ సాధికారత కోసం ఏర్పడి ఐక్యరాజ్య సమితి పాలస్తీనాను దేశంగా గుర్తించాలని అనేక ఉద్యమాలు, పోరాటాలు చేయడం జరిగింది. ఈ క్రమంలోనే యాసర్ అరాఫత్ నేతృత్వంలో 1969-2004 వరకు ఇజ్రాయిల్ పాలస్తీనా మధ్య ఎన్నోసార్లు శాంతి చర్చలు జరిగాయి. ఐనప్పటికీ శాంతి చర్చలకు విఘాతం కల్పిస్తు ఇజ్రాయిల్ ఎన్నోసార్లు పాలస్తీనాపై దాడికి దిగింది. అదేవిధంగా పాలస్తీనాలోని తిరుగుబాటుదారులు కూడా ఇజ్రాయిల్‌పై దాడులు చేసి పౌరులను బందీలుగా పట్టుకోవటం జరిగింది. శాంతి చర్చలకు విఘాతం కలగటం సమస్య మొదటికి రావటం కొనసాగుతోంది. ఇజ్రాయిల్ పాలస్తీనా మధ్య శాంతి చర్చలకు, ఘర్షణను నివారించడానికి కృషి చేసినందుకు గాను 1994లో ఇజ్రాయిల్ అధ్యక్షుడు యజ్ తక్ రాబిన్ కి, యాసర్ అరాఫత్‌కి నోబెల్ శాంతి బహుమతిని సంయుక్తంగా లభించింది.

అనంతరం యాజ్ తక్ రాబిన్‌ను ఇజ్రాయిల్ పౌరుడు చంపటం 2004లో యాసర్ అరాఫత్ అనుమానాస్పదంగా మరణించడం ఆ తర్వాత విషప్రయోగం ద్వారా చనిపోయినట్లు వదంతులు రావటం, నెతన్యూ అధికారంలోకి రావడం వరకు జరిగిన సంఘటనలు పాలస్తీనా సమస్యను సంక్లిష్టం చేశాయి.

ఇజ్రాయిల్ పాలస్తీనా సమస్యను రెండు ప్రాంతాల మధ్య మత ఘర్షణ కాదు. పాలస్తీనియన్లు భౌగోళికమైన ఉనికి, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటం మాత్రమే. కానీ హింసను మాత్రం ఎవరూ సమర్ధించలేరు. "భద్రతలను కలిగి ఉండటం వలన వ్యక్తిలో ఉద్భవించే మానసిక ప్రశాంతతయే స్వేచ్ఛ" అంటాడు. ప్రముఖ రాజనీతి తత్త్వవేత్త మాంటెస్కు, ఇక్కడ పాలస్తీనీయన్లు అభద్రతాభావానికి గురైన సందర్భంలోంచి వచ్చినదే నేడు "హమాస్" తిరుగుబాటు "ఆరు భద్రతా మండలి తీర్మానాలను", 1993లో జరిగిన "ఓస్లో" ఒప్పందంను కూడా ఇజ్రాయిల్ తుంగలో తొక్కింది, పైగా ఐక్యరాజ్యసమితిలోని "వీటో" అధికారం కల్గిన దేశాల మద్దతు ఇజ్రాయిల్ కి ఉండటం దానిని సాకుగా చూసుకొని సమయం దొరికినప్పుడల్లా ఇజ్రాయిల్ సైనికులు పాలస్తీనియన్లను ఉగ్రవాదం పేరుతో వేధించటం, చంపటం, పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించటం జరుగుతోంది. దీనివల్ల స్వంత భూభాగంలో పరాయి వారైన పాలస్తీనియన్లలో ఆగ్రహం, అభద్రతా భావం కట్టలు తెంచుకుంది. ఏడు దశాబ్దాలుగా, పాలస్తీనా ప్రజలు ఇజ్రాయిల్ పోలీసుల ఆంక్షలు దాటి మసీదులలో గాని ఇతర ప్రదేశాలలో గాని స్వేచ్ఛగా సంచరించే అవకాశం లేకుండా చేసింది. ఈ నియంత్రణే తాజాగా "హమాస్" ఇజ్రాయిల్ పైన చేసినదాడికి కారణమని చెప్పాలి. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై ఇజ్రాయిల్ ప్రజలలో పెరుగుతున్న అసమ్మతిని ఈ యుద్ధంతో తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నంలోనే పాలస్తీనా ప్రజలపైన భీకరమైన దాడులకు దిగి ఎక్కువ నష్టం కల్గిస్తున్నాడు.

యుద్ధం ఎవరి వైపు నుండి మొదలైనా నష్టపోయేది సాధారణ పౌరులే, సంవత్సరాలుగా కష్టపడి నిర్మించుకున్న భవనాలు పేకమేడల్లా కూలుతున్న దృశ్యాలు, చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, శిథిల భవనాల్లోంచి వినిపిస్తున్న హాహాకారాలు మనసును చలింపజేసేవిధంగా వున్నాయి. యుద్ధం, యుద్ధ కారణాలు, ఫలితాలు అనేవి ఎలా ఉన్నా యుద్ధం ముగిసిన తర్వాత సమీక్షలు కాదు చేసుకోవలసింది. ప్రపంచంలోనే అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు ఇజ్రాయిల్ పాలస్తీనా దేశాలు ఐనప్పుడు అటువైపు అగ్రరాజ్యాలు గాని, ప్రపంచ శాంతి కోసం ఏర్పడిన ఐక్యరాజ్యసమితి కాని, ఇరుదేశాల మధ్య శాంతి, సుహృద్భావ వాతావరణం నెలకొనేలా చేసిన ఒప్పందాలు ఎందుకు విఫలం అయ్యాయి అనేది ఆలోచించాలి, తరతరాలుగా పాలస్తీనా ప్రజలు పడుతున్న కష్టాల నుంచే "హమాస్" తిరుగుబాటు దారులు పుట్టుకొచ్చారు అన్నది మరిచిపోరాదు.

అంతెందుకు రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ఐక్యరాజ్యసమితి చేసిందేమిటి? ఎందుకు తనవంతుగా చొరవ తీసుకొని ఇరు దేశాల మధ్య యుద్ధ నివారణ, శాంతి చర్చలకు ముందుకు రావటం లేదు. ఒకవేళ ఐక్య రాజ్యసమితి శాంతి ప్రతిపాదన చేసినా ఇరుదేశాలు ఆ ప్రతిపాదనను ఎందుకు అంగీకరించడం లేదు? అంటే దీనిని బట్టి ఐక్యరాజ్య సమితి ఉనికి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అమెరికా జేబు సంస్థగా మారిందన్న విమర్శ కూడా వుంది. పాలస్తీనా- ఇజ్రాయిల్ సమస్య, చైనా- వియత్నాం సమస్య, ఉత్తర కొరియా - దక్షిణ కొరియా మధ్య కొనసాగుతున్న వివాదం అలాగే చైనా- అమెరికా మధ్య కొనసాగుతున్న వివాదం, ఉత్తర కొరియా -అమెరికా మధ్య ముదురుతున్న వివాదం, అలాగే భారత్- చైనా సరిహద్దు వివాదం, భారత్- పాకిస్తాన్ మధ్య ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న "కాశ్మీర్" సరిహద్దు వివాదం ఇలాంటివి చాలా ఉన్నాయి.

ఇప్పటికైనా ప్రపంచ దేశాలు ఇజ్రాయిల్ - పాలస్తీనా సమస్యను అత్యంత ప్రాధాన్యత కల్గిన సమస్యగా గుర్తించి అంతర్జాతీయ సమస్యగా పరిగణించి పాలస్తీనాను ఒక దేశంగా రాజకీయ సార్వభౌమాధికారం కల్పించి స్వేచ్ఛను ప్రసాదిస్తే ఈ ఘర్షణలను నివారించగలరు. లేనిపక్షంలో ఈరోజు యుద్ధంలో గాయపడి కోలుకున్నవారు లేదా యుద్ధభూమిలో జన్మించిన పిల్లలు భవిష్యత్తులో పెరిగి పెద్దైన తర్వాత అదే "హమాస్"లో చేరి తిరిగి ఇజ్రాయిల్ పై దాడి చెయ్యరని గ్యారంటి ఏమి లేదు.

కనిపెట్టిన సాంకేతిక పరిజ్ఞానాన్ని యుద్ధాల ద్వారా పరీక్షించటం కాదు, పేదలకు నాణ్యమైన విద్యను మౌలిక సదుపాయాలను ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించి "పౌరులకు" స్వేచ్ఛా పూరితమైన పాలనను అందించిన వారు గొప్ప పాలకులు అవుతారు. యుద్ధాన్ని ఆపిన వాడు గొప్పవాడు, యుద్ధం చేసిన వాడు కాదు. పది సంవత్సరాల పాలస్తీనా బాలిక నేలమట్టమైన ఇంటి ముందు నిలబడి "నేను ఏం పాపం చేశాను? ఏం తప్పు చేశాను? నా వాళ్ళందరు ఇజ్రాయిల్ సైన్యం దాడిలో చనిపోయారు ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్న ప్రపంచానికి వేసింది. ప్రపంచం ఏం సమాధానం చెప్పగలదు ఈ ప్రశ్నకు. ఐక్యరాజ్య సమితి గాజాస్ట్రిప్‌లో ప్రస్తుతం యాభై వేల మంది మహిళలు గర్భంతో ఉన్నట్లు ఇటీవలే వెళ్ళడించింది. ఒక వైపు తమ ఇండ్లపై బాంబుల వర్షం మరొక వైపు సురక్షిత స్థావరాలకు బిక్కుబిక్కు మంటూ వెళ్ళాల్సిన పరిస్థితి ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో వారి మానసిక స్థితి ఏమిటి? అత్యవసరమైన ఆరోగ్య సమస్య వస్తే వైద్యం దొరుకుతుందా అన్నది ఆలోచించాలి. రెండు దేశాల ప్రజలు ఎప్పుడు ఎం జరుగుతుందో అన్న భయంతో కాకుండా స్వేచ్ఛగా బ్రతికే శాశ్వత ఏర్పాట్లు జరగాలి. దానికి ప్రపంచం మొత్తం పూనుకొని పరిష్కరించాలి. ❖

# అల్లాహ్ నామంతో...

- ముహమ్మద్ వహీదుద్దీన్

**పూర్వకాలం మాట.** ఒకనాడు ఇద్దరు వ్యక్తులు (రహీమ్, కరీమ్) అంగడిలో కలుసుకున్నారు. నా దగ్గర ఎత్తైన, బలమైన తెల్లని గుర్రం ఉంది అంటూ చెట్టు కింద ఉన్న గుర్రాన్ని రహీమ్ కరీమ్‌కు చూపిస్తాడు. కరీమ్ ఆ గుర్రాన్ని చూస్తూ భలే బాగుంది, కానీ నేను ఈ గుర్రాన్ని కొనడానికి రాలేదు. నా దగ్గర ఐదువందల దిర్హమ్‌లు ఉన్నాయి. పట్టణానికి దూరంగా, మంచి వాతావరణం కలిగివున్న గ్రామంలో కాలువకి దగ్గరగా ఉన్న ఒక పొలం కొనాలనుకుంటున్నాను అని కరీమ్ రహీమ్‌కు చెప్పాడు.

రహీమ్ చెబుతూ మా ఊరిలో నాకు స్థలం ఉంది. పొలం మాత్రం లేదు. ఏడువందల దిర్హమ్‌లకు అమ్మేస్తాను. నీవు దానిని తీసుకొని పంటలు పండించుకో. రాళ్ళు రప్పలు ఉన్నాయి. చదును చేసుకో. ప్రస్తుతం నా దగ్గర 500 దిర్హమ్‌లు మాత్రమే ఉన్నాయి. ఆ భూమిని ఇస్తానంటే తీసుకొని దానిని సారవంతం చేస్తాను. దాంతో ఒకరిపై ఒకరికి నమ్మకం కలిగి తన భూమిని 500 దిర్హమ్‌లకు అమ్మి వేస్తాడు రహీమ్. సంతోషంతో ఆ వ్యక్తి భూమికి సంబంధిం చిన పత్రాలు వ్రాయించుకుని వెళ్ళిపోయాడు. వారం రోజుల తర్వాత కరీమ్ ఆ భూమిలో ఉన్న చెట్టు చేమలు, రాళ్ళు రప్పలు తొలగించి భూమిని చదును చేయించే సందర్భంలో భూమిలో ఉన్న మూడు ఇత్తడి పెద్ద చెంబులు దొరికాయి. బయటకు తీశాడు.

చెట్టు కింద వెళ్ళికి రెండు రకాతులు నమాజ్ చదివి దుఆ చేసి 'బిస్మిల్లా' (అల్లాహ్ నామంతో) అని తోలుతో కట్టి ఉన్న చెంబు మూతిని తొలగించాడు. లోపల మొత్తం వజ్రాలతో నిండిఉన్నది. రెండవ దానికి కూడా 'బిస్మిల్లా' అని తీశాడు. అందులో బంగారు నాణేలతో నిండి ఉన్నది. మూడవ దానికి కూడా అలాగే తీస్తాడు. వెండి నాణేలతో నిండి ఉన్నది. వెంటనే సాష్టాంగ పడిపోతాడు.

అల్లాహ్‌పై గట్టి విశ్వాసి అయిన కరీమ్ తనకు భూమి అమ్మిన రహీమ్ దగ్గరకు ఆ మూడు ఇత్తడి చెంబులు పట్టుకు వెళ్ళి విషయం మొత్తం చెప్పేస్తాడు. ఆ చెంబులు నీదే, అది నీ తాతముత్తాతలు ఎవరో దాచి ఉంటారు. నాకు నీవు భూమిని మాత్రమే అమ్మినావు. భూమి లోపల ఉన్న నిధి నిక్షేపాలు నాకు అమ్మలేదు. కాబట్టి ఈ మూడు చెంబుల్లో ఉన్న ధనం అంతా నీకే దక్కుతుంది. ఖచ్చితంగా నీవే తీసుకోవాలని పట్టుబట్టాడు.

ఆ భూమి అమ్మిన రహీమ్ కూడా చాలా విశ్వాసుడు కావడంతో ఈ ధనం అంతా నాది కాదు. నేను ఎప్పుడైతే భూమిని అమ్మేశానో అందులో ఎలాంటి నిధి నిక్షేపాలు దొరికినా అవి నీకే చెందుతాయి కాబట్టి ఈ చెంబుల్లో ఉన్న ధనాన్ని నేను తీసుకోలేను అంటూ తిరిగి వాదించడం మొదలుపెట్టాడు. ఇలా చాలాసేపు అది నీదంటే నీదేనంటూ వాదించుకున్నా వారికి ఏం చెయ్యాలో అలాగే కూర్చున్నారు.

అంతలోనే అక్కడ నుంచి ఊరు పెద్ద మనిషి వెళుతూ ఉంటాడు. వారి వాదనలు చూసి దగ్గరకు వెళ్ళి అడిగాడు. వారు విషయం అంతా చెప్పారు. పక్క పట్టణంలో ఉన్న ఖాజీ దగ్గరకు వెళ్ళమని మంచి సలహా ఇచ్చాడు. వారిద్దరు అలాగే చేశారు. ఖాజీకి విషయాన్ని క్లుప్తంగా వివరించారు. ఖాజీ గారు చాలాసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు.

మీ ఇద్దరికి సంతానం ఉందా అని అడిగారు. రహీమ్ మాటా ్లడుతూ తనకు ఒకే కూతురు ఉందని చెప్పాడు. కరీమ్ మాట్లా డుతూ తనకు ఒక కొడుకు ఉన్నాడన్నాడు. ముందు వారిద్దరికి ఒకరినొకరు చూపించండి, వారిద్దరికి నచ్చితే వివాహం చేయండి. ఆ తర్వాత ఏం చేయాలో చెబుతాను. వారిద్దరు అలాగే చేశారు. అబ్బాయికి అమ్మాయి నచ్చింది, అమ్మాయికి అబ్బాయి నచ్చాడు.

ఖాజీ గారి ఆధ్వర్యంలో ప్రవక్త(స) గారి సున్నత్ ప్రకారం వివాహం జరిగింది. ఇప్పుడు మీరిద్దరు వియ్యంకుళ్ళు అయ్యారు. కాబట్టి మీకు దొరికిన సంపద మూడు భాగాల్లో పంచితే బాగుంటుందని చెప్పారు. ఇద్దరు కూడా సరే అన్నారు.

మొదటి భాగం వజ్రాలతో నిండి ఉన్న పెద్ద చెంబును అల్లాహ్ మార్గంలో పేద వారికి, అనాథలకు, వితంతువులకు, బంధువు లలో పంచి వేయండి.

రెండవ భాగం బంగారు నాణేలతోనిండి ఉన్న దానిని మీ సంతానానికి ఇచ్చివేయండి.

మూడవ భాగం వెండి నాణేలతో నిండి ఉన్న దానిని మీరు తీసుకోండి.

ఇద్దరు కూడా ఖాజీ చెప్పిన విధంగా చేశారు. వారికి లభించిన దానిలో నుంచి ఖాజీకి కూడా ఇచ్చారు. అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పుకుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయారు.


ఇందులో నీతి ఏమిటంటే, కొండంత సంపద లభించినా అల్లాహ్ భయం, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) చెప్పిన విధంగా నడవటం, ఇస్లామీయ ధర్మాన్ని, షరీఅత్‌ను కాపాడే ప్రయత్నం ఖచ్చితంగా చేయాలి. ❖

'చరితార్థులు'-2



# నవాబ్ తఫజ్జుల్ హుస్సేన్ ఖాన్ సరత్‌జంగ్ (-1859)

22




1857నాటి భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ పాలకుల ఆధిపత్యం నుండి తమ సంస్థానాలను స్వతంత్ర రాజ్యాలుగా ప్రకటించి, ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారుల జాడ లేకుండా చేసి, ఆంగ్లేయ సైన్యాలతో పోరుకు సిద్ధపడిన యోధులలో ప్రముఖులు నవాబ్ తఫజ్జుల్ హుస్సేన్ ఖాన్ సరత్‌జంగ్. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఫరూఖాబాద్ సంస్థానం మొగల్ పాలకుల సామంత రాజ్యంగా 1857లో నవాబ్ తఫజ్జుల్ హుస్సేన్ ఖాన్ ఖాన్ ఏలుబడిలో ఉంది. ఆనాడు ఈస్ట్ ఇండియా కంపెనీ సాగిస్తున్న అహంకార పూరిత ఆధిపత్యాన్ని అంగీకరించలేక పోయిన భారతీయులు 1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ శంఖారావాన్ని పూరించగానే, ఆ పిలుపును అందుకున్న ఫరూఖాబాద్ నవాబు మాతృభూమి కోసం సర్వం త్యాగం చేయగల యోధులతో కలసి ఫరూఖాబాద్‌ను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించి ఆంగ్లేయాధికారులను వెళ్ళ గొట్టారు. ఆ అధికారులు ఫతేఘడ్ దుర్గంలో దాక్కొనగా, నవాబు తఫజ్జుల్ హుస్సేన్ ఖాన్ నేతృత్వంలో స్వాతంత్ర్య సమరయోధులు దుర్గాన్ని చుట్టుముట్టి, ఐదు రోజుల పోరాటం తరువాత దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత ఏడాది పాటు నవాబ్ తఫజ్జుల్ హుస్సేన్ ఖాన్ పాలన సాగించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ బలగాలు ఢిల్లీలోని ఎర్రకోటను స్వాధీనం చేసుకున్నాక కంపెనీ సైన్యాధికారులు ఫరూఖాబాద్ మీద దృష్టి సారించి, భారీ బలగాలతో ఫరూఖాబాద్‌ను చుట్టుముట్టారు. నవాబ్ తఫజ్జుల్ హుస్సేన్ ఖాన్ తన బలగాలతో ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాలను ఎదుర్కొన్నారు. ప్రతీకారంతో రగిలిపోతున్న శత్రు సైన్యాలు మిడతల దండులా వచ్చిపడుతుండగా ధైర్య సాహసాలతో పోరాడుతున్న స్వాతంత్ర్య సమరయోధుల సంఖ్య తరిగి పోసాగింది. ప్రతికూల పరిస్థితులను గమనించిన నవాబు ప్రజల ఆస్తి పాస్తులకు, పోరాట యోధుల ప్రాణాలకు మరింత ముప్పు వాటిల్లే ప్రమాదకర పరిస్థితుల నేపథ్యంలో సహచరుల సలహా మేరకు యుద్ధరంగం నుండి తప్పుకున్నారు. మార్గమధ్యంలో స్వాతంత్ర్య సమరయోధులు తాంతియా తోపేను కలసి ఆయనతోపాటుగా నేపాల్ అడవుల్లోకి నిష్క్రమించారు. ఆ సమయంలో ఆంగ్లేయాధికారి కెప్టన్ బైరో నవాబు వద్దకు వచ్చి ఆయన ప్రాణాలకు, ఆయన సహచరుల ప్రాణాలకు ఏలాంటి నష్టం లేకుండా కంపెనీతో సంధి చేసుకొమ్మన్నాడు. అందుకు నవాబు అంగీకరించాక మాటతప్పిన ఆంగ్లేయులు ఆయనను నిర్బంధించి రాజద్రోహం నేరారోపణ చేసి విచారణ సాగించి రాజ్య బహిష్కరణ శిక్షను ప్రకటించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో ఉన్న మరే ప్రాంతంలో కూడా హుసైన్‌ఖాన్ ఉండరాదని శాసిస్తూ, 24 గంటల్లో ఫరూఖాబాద్ వీడి వెళ్ళి పోవాల్సిందిగా 1859 మే 23న ఆంగ్లేయాధికారులు హుకుం జారీ చేశారు. కుటుంబ సభ్యులను కలవడానికి కూడా సమయం లేని పరిస్థితులలో మక్కాకు బయలుదేరిన ఫరూఖాబాద్ నవాబు తఫజ్జుల్ హుస్సేన్‌ఖాన్ సరత్‌జంగ్ ఆ తరువాత ఏమైయ్యారన్నది తెలియరాలేదు. ✤




9440241727


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2** (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




## పాలస్తీనా ప్రజల కోసం గొంతెత్తడం నేరమా?

తెలంగాణలో నిరసన తెలిపే హక్కు అంతరించిందా? పాలస్తీనాపై ఇస్రాయెల్ దాడులను ఖండిస్తూ తెహ్రీక్ ముస్లిం షబ్బాన్ ర్యాలీని రద్దు చేసి, సంస్థ అధ్యక్షుడు ముహమ్మద్ ముస్తాక్ మాలిక్‌ను హైదరాబాద్ పోలీసులు గృహ నిర్బంధంలో పెట్టారు. ఇది ప్రభుత్వ నిర్బంధానికి నిదర్శనం. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నిరసనలు జరుగుతున్నాయి. చాలా రాష్ట్రాలు ఈ నిరసనల పట్ల విభిన్న వైఖరి ప్రదర్శించాయి. ఉత్తర ప్రదేశ్‌లో, పాలస్తీనాకు సంఘీభావం తెలిపినందుకు ముస్లిం ధర్మవేత్తలను పోలీసులు లక్ష్యంగా చేసుకున్నారు. అలీఘర్ విశ్వవిద్యాలయం విద్యార్థులపై కేసులు పడ్డాయి.దీనికి విరుద్ధంగా ఇస్రాయెల్ అనుకూల మార్చ్ ఎటువంటి ఆటంకం లేకుండా ఉత్తరప్రదేశ్‌లో జరిగింది. న్యూఢిల్లీలో పాలస్తీనాకు మద్దతుగా తీసిన ర్యాలీ సందర్భంగా పోలీసులు అనేక మందిని నిర్బంధించారు. మహారాష్ట్రలో గాజాపై యుద్ధాన్ని ఖండిస్తూ ర్యాలీలో పాల్గొన్న వారిని అరెస్టులు చేశారు. అదేవిధంగా కర్ణాటకలో పాలస్తీనియన్లకు మద్దతిచ్చే సైలెంట్ మార్చ్ తర్వాత కార్యకర్తలు వేధింపులను ఎదుర్కొన్నారు. తెలంగాణలోను పాలస్తీనా కోసం గొంతెత్తితే నిర్బంధాలు తప్పవన్నట్లు ఇప్పుడు ఈ సంఘటనలు చెబుతున్నాయి. ఈ అణిచివేత ఉన్నప్పటికీ పౌరసమాజం, సామాజిక కార్యకర్తలు పాలస్తీనా పట్ల తమ గొంతు విప్పుతూనే ఉన్నారు. పాలస్తీనాకు లభిస్తున్న సంఘీభావానికి ఇది నిదర్శనం. నిరసనలపై తెలంగాణ ప్రభుత్వ వైఖరి భారతదేశంలో ప్రజాస్వామ్యానికి సవాలుగా మారుతున్న పరిస్థితులను తెలియజేస్తోంది. తెలంగాణలో భారత రాష్ట్ర సమితి పాలన ఏ తీరులో ఉందో కూడా దీనివల్ల అర్థమవుతోంది. పౌర స్వేచ్ఛల పట్ల ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలుస్తోంది.

## నంద్యాలలో పాలస్తీనా అనుకూల ర్యాలీపై పోలీసుల ప్రతాపం

నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో ముస్లిం జేఏసీ నాయకులు పోలీసులకు మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. శుక్రవారం నంద్యాలలో ముస్లిం జేఏసీ నాయకులు పాలస్తీనాలో మృతి చెందిన వారికి సంఘీభావంగా కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ర్యాలీ శ్రీనివాస సెంటర్‌కు చేరుకోగానే అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం జేఏసీ నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ముస్లిం నాయకులను పోలీసులు అరెస్టు చేసి వన్ టౌన్ పోలీసస్టేషనకు తరలించారు. దీంతో ముస్లింలు వన్ టౌన్ పోలీస్ స్టేషన వరకు శాంతియుత ర్యాలీని మళ్లించారు. అక్కడ కొంతసేపు ఆందోళన చేశారు. ముస్లింలతో చర్చించిన పోలీసు అధికారులు అరెస్టు చేసిన వారిని విడుదల చేయడంతో ముస్లింలు శాంతియుతంగా ర్యాలీ చేపట్టారు.

## మజ్లిస్‌కు మతపెద్దల అల్టిమేటమ్

హైదరాబాద్ దాటి రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో పోటీ చేయవద్దని మజ్లిస్ పార్టీని ముస్లిం మత పెద్దలు కోరారు. ఒకవేళ అలా పోటీ చేస్తే రాష్ట్రంలో పుంజుకుంటున్న కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చే కుట్రగానే భావించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. గతంలో పోటీ చేసిన సీట్లలోనే పోటీ చేయాలని కొత్త సీట్లలో వద్దని మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ పార్టీకి హితవు పలికారు. ఆయా వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తెలంగాణలో ఎన్నికల హడావుడి ప్రారంభం కాగానే ఈసారి అధిక సీట్లలో పోటీ చేస్తామని మజ్లిస్ పార్టీ ప్రచారం చేయడంతో ఇక్కడి ముస్లింలలో అనుమానాలు ప్రారంభమయ్యాయి. గతంలో మజ్లిస్ కేవలం 8 సీట్లలో పోటీచేసి 7 సీట్లు గెలవడం తెలిసిందే. ఈసారి పోటీ చేసే స్థానాలు రెండంకెల సంఖ్యలో ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. ముస్లిం ఓటు బ్యాంకు ఉన్నచోట అభ్యర్థిని నిలబెట్టడం ద్వారా కాంగ్రెసును నష్టపరచి, బీఆర్ఎస్‌కు లబ్ధి చేకూర్చేందుకు మజ్లిస్ ప్రయత్నిస్తోందని ముస్లింలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా ఎక్కడ ఎన్నికలు జరిగినా అక్కడికి చేరుకుంటున్న మజ్లిస్ పార్టీ గురించి ముస్లిం వర్గాల్లో అనుమానాలు మొదలయ్యాయి. మహారాష్ట్ర, గుజరాత్, బిహార్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో మజ్లిస్ పార్టీ పోటీ చేసి పొందిన లాభం కన్నా బీజేపీకే లబ్ధి చేకూర్చిందనే అభిప్రాయాలు బలపడుతున్నాయి. గతంలో కర్ణాటక ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ పోటీ చేస్తోందని ప్రచారం జరగ్గానే అక్కడి ముస్లిం నేతలు చేతులెత్తి 'మేము ఇక్కడ ప్రశాంతంగానే ఉన్నాం.. దయచేసి మీరు రావద్ద'ని అసదుద్దీన్ ఒవైసీకి చెప్పేశారు. దశాబ్ద కాలంగా ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా మజ్లిస్‌కు ఎన్ని సీట్లు వచ్చాయనే దానికన్నా ఆ పార్టీ వల్ల బీజేపీకి ఎన్ని ఎక్కువ సీట్లు వచ్చాయి... సెక్యులర్ పార్టీ ఎలా నష్టపోయిందనే అంశాల గురించే చర్చలు జరిగాయి.

సర్వత్రా

## బంగ్లాదేశ్ లో రాజకీయ సంక్షోభం

అక్టోబర్ 28న బంగ్లాదేశ్లో వేలాది మంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. ఢాకా వీధులు నినాదాలతో మారుమోగాయి. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్లోని ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నిర్వహించిన ప్రదర్శనలివి. జనవరిలో బంగ్లాదేశ్లో ఎన్నికలు జరగవలసి ఉంది. ఎన్నికలకు ముందు కేర్ టేకర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, షేక్ హసీనా రాజీనామా చేసి తప్పుకోవాలని, ఆ విధంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చేయాలని బలమైన డిమాండ్ వినిపించింది. ఈ నిరసన ప్రదర్శనల్లో హింసాకాండ చోటు చేసుకుంది. పోలీసులు టియర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. నిరసన కారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ఒక పోలీసు అధికారి మరణించారు. దాదాపు 100 మంది గాయపడ్డారు. ఇందులో 41 మంది పోలీసు అధికారులు, అనేక మంది జర్నలిస్టులు కూడా ఉన్నారు. ఈ నిరసన ప్రదర్శనల్లో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఢాకాలోని నయా పల్టన్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు మారుమోగాయి. హింసాత్మక ఘర్షణల్లో చాలా నష్టం జరిగింది. డజన్ల కొద్దీ వాహనాలకు నిరసనకారులు నిప్పు పెట్టారు. ఢాకా మెట్రోపోలిటన్ పోలీసు దళాల ప్రతినిధి ఫరూక్ హుస్సేన్ మాట్లాడుతూ హింసాకాండలో కొందరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. అక్కడ వార్తల సేకరణకు వచ్చిన జర్నలిస్టులపై కూడా దాడులు జరిగాయి. వారు కూడా చాలా మంది గాయపడ్డారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సీనియర్ నాయకుడు అబ్దుల్ ముయీన్ ఖాన్ మాట్లాడుతూ శాంతియుత ప్రదర్శనలపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించడం వల్లనే హింసాత్మకంగా మారిందని చెప్పారు. ఘర్షణలు చాలా తీవ్రస్థాయిలో జరిగాయి. ఆ ప్రాంతమంతా యుద్ధరంగాన్ని తలపించింది. పోలీసుల చర్యలకు ప్రతిస్పందనగా ప్రతిపక్షం దేశవ్యాప్త సమ్మెకు పిలుపు నిచ్చింది. బలవంతపు నిర్బంధాలు, హత్యలు, అణిచివేతలు గత 15 సంవత్సరాలుగా కొనసాగుతున్నాయని పలువుర తీవ్రవిమర్శలు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ దమననీతిపై చాలా మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంగ్లాదేశ్లో ప్రస్తుతం తలెత్తిన సంక్షోభ పరిస్థితి ప్రజల్లో ఉన్న ఆగ్రహావేశాలను ప్రతిబింబిస్తోంది. రాజకీయ సంస్కరణల ఆవశ్యకతను తెలియజేస్తోంది. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. షేక్ హసీనా 2009 నుంచి అధికారంలో ఉన్నారు. నిరంకుశంగా వ్యవహరించడం, మానవ హక్కుల ఉల్లంఘనలు, రాజకీయ అసమ్మతిని అణిచేయడం వంటి అనేక ఆరోపణలు ఆమెపై ఉన్నాయి. ఈ నిరసన ప్రదర్శనల తర్వాత అంతర్జాతీయ ఒత్తిడి కూడా పెరిగింది. ముఖ్యంగా పాశ్చాత్య దేశాలు బంగ్లదేశ్ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడాలని, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని ఒత్తిడి తీసుకువస్తున్నాయి. బంగ్లాదేశ్ లో ప్రజాస్వామ్యప్రక్రియ పట్ల గతంలో అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య ప్రక్రియకు నష్టం కలిగిస్తున్న కొందరు బంగ్లాదేశీలకు అమెరికా వీసాలు నిరాకరించడం కూడా జరిగింది.

## రక్తమోడుతున్న గాజాపై అగ్రరాజ్యాల వైఖరి

ఇజ్రాయెల్ హమాస్ మధ్య యుద్ధంలో రష్యా, చైనా దేశాలు కూడా నిర్దిష్ట వైఖరిని తీసుకున్నాయి. గత మూడు రోజులుగా వస్తున్న వార్తలు చూస్తే రెండు దేశాలు అమెరికాను కట్టడి చేయడానికి కలిసి పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది. భద్రతామండలిలో రష్యా, చైనాలు అమెరికా ప్రతిపాదనను వీటో చేశాయి, అమెరికా ప్రతిపాదన సహజంగానే ఇస్రాయెల్కు అనుకూలంగా ఉంది.. అమెరికా ముసాయిదా తీర్మానంలో మానవతా సహాయం, పౌరుల రక్షణ ఏర్పాట్ల కోసం పోరాటంలో విరామం కోరింది. అలాగే గాజాలోని హమాస్ మిలిటెంట్లకు ఆయుధాలు అందకుండా అడ్డుకోవాలని పేర్కొంది. కాని ఈ తీర్మానంలో యుద్ధవిరమణ, సమస్య పరిష్కారం ఏదీ లేదని రష్యా చైనా దేశాలు విమర్శించాయి. ఐక్యారాజ్య సమితిలో చైనా రాయబారి జాంగ్ జున్ తీర్మానాన్ని తీవ్రంగా విమర్శించారు. ఐక్యరాజ్యసమితిలో రష్యా రాయబారి వాసిలీ నెబెంజియా ఈ తీర్మానాన్ని విమర్శిస్తూ ఇది గాజాలో ఇస్రాయిల్ భూదాడిని ప్రోత్సహించేలా, అవసరమైన అధికారాన్ని భద్రతా మండలి ఇస్రాయీల్కు ఇస్తున్నట్లుఉందని అన్నారు. ఇది మరింత పౌర ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉంది. ఈ తీర్మానం వీటో అయినా తర్వాత భద్రతా మండలి రష్యా ప్రతిపాదించిన ముసాయిదా తీర్మానంపై ఓటింగ్ నిర్వహించింది. మానవతా కాల్పుల విరమణ కోరుతు, గాజాలో పౌరులు ఖాళీ చేయాలని ఇస్రాయీల్ జారీ చేసిన ఆదేశాన్ని ఉపసంహరింప చేయాలని రష్యా ముసాయిదా తీర్మానం కోరింది. ఈ తీర్మానం కూడా వీగిపోయింది. ఈ నేపథ్యంలోనే హమాస్ ప్రతినిధులకు, రష్యా ఉప విదేశాంగ మంత్రికి మధ్య సమావేశం జరిగింది. హమాస్కు చెందిన ప్రతినిధి బృందం, మాజీ మంత్రి బాసేమ్ నయీమ్, హమాస్ సీనియర్ ప్రతినిధి ముసా అబు మర్జౌక్ నేతృత్వంలో ప్రతినిధి బృందం రష్యా ఉప విదేశాంగ మంత్రి మిఖాయిల్ బొగ్దానోవ్తో మాస్కోలో సమావేశమయ్యింది. చర్చల వివరాలు బయటకు రాలేదు. కాని రష్యా, హమాస్ మధ్య ఒక స్థాయిలో అవగాహన ఉందన్నది స్పష్టం అవుతోంది. ఐక్యరాజ్య సమితిలో అమెరికా ప్రవేశపెట్టిన మరో తీర్మానం కూడా వీటోకు గురయ్యింది. రష్యా చైనాలు రెండు ఈ తీర్మానాన్ని వీటో చేశాయి. అమెరికా జోక్యాన్ని వ్యతిరేకిస్తామని ప్రకటించాయి. అమెరికా విషయంలో సమైక్యంగా వ్యవహరిస్తున్నట్లు రెండు దేశాలు స్పష్టం చేశాయి. ఒకవైపు అమెరికా, పాశ్చాత్యదేశాలు, మరోవైపు రష్యా చైనాలు మధ్యప్రాచ్యంలో తలపడుతున్నాయి. మధ్యప్రాచ్యంలో అమెరికా పెత్తనానికి చైనా గండికొడుతోంది. మరోవైపు రష్యా కూడా తన పావులు కదుపుతోంది.











# దివ్య ఖుర్ఆన్ అధ్యయనంతో సుసమాజ నిర్మాణం సాధ్యం

## - యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ ముహమ్మద్ దావూద్

**చెడు** అన్నది నేడు చాలా సునాయాసంగా, అతివేగంగా ప్రబలిపోయి మానవ జీవితంలోని దాదాపు అన్నిరంగాలలో తిష్ట వేసింది. మనం నిత్యం ఎదుర్కొంటున్న సామాజిక రుగ్మతలు సమస్యలన్నింటికీ మూల కారణం. అవినీతి, అనైతికత.. వీటి నుండి మన పిల్లలను కాపాడటం మనందరి కర్తవ్యం. దివ్య ఖుర్ఆన్‌తో పటిష్ట సంబంధం ద్వారానే మంచి సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ ముహమ్మద్ దావూద్ పేర్కొన్నారు.

పూర్వం మద్యపానం, జూదం, అనైతికత, నేర కార్యకలాపాలు పరిమితంగా ఉండేవి. నేడు స్కూల్‌కి వెళ్ళే పిల్లలు కూడా అనైతిక అలవాట్లకు బానిసలవుతున్నారు. ఇంటర్నెట్‌లోని అశ్లీల సినిమాలు, యూట్యూబ్, మొబైల్ గేమ్స్‌లకు అతుక్కుపోయి అతి విలువైన కాలాన్ని వృధా చేయడంతోపాటు పెద్దల పట్ల గౌరవం లేని విధంగా వ్యవహరిస్తున్నారు. బాల నేరస్తులు పెరిగిపోతున్న ఈ రోజుల్లో మనం పిల్లలకు నైతిక విలువలు నేర్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారిని దివ్య గ్రంథాలకు దగ్గర చేసి వారిలో నైతిక విలువలు, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతలు నేర్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే గత 9 సంవత్సరాలుగా యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురానిక్ స్టడీస్ (UFQS) బాల బాలికల కొరకు దివ్య ఖుర్ఆన్ ప్రతిభా పోటీలు నిర్వహిస్తూ దైవ గ్రంథంతో సంబంధం పటిష్టం చేయడానికి తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకొస్తున్నామని అధ్యక్షులు ముహమ్మద్ దావూద్ తెలిపారు. ఇప్పటివరకు ఆంధ్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 3 నుంచి 12 సంవత్సరాల వయసు గల బాల బాలికలు చాలామంది దివ్యఖుర్ఆన్ కంఠస్థ పోటీల్లో పాల్గొనడం జరిగింది. ఆ కృషిలో భాగమే UFQS ఆధ్వర్యంలో ఏటా రాష్ట్ర స్థాయి బాల బాలికల దివ్య ఖుర్ఆన్ కంఠస్థ ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ సంవత్సరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జరిగిన క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్‌లో ఎన్నుకోబడిన గ్రూపుల నుండి 34 మందిని ఫైనల్స్‌లో ఎంపిక చేస్తారు. సెమీ ఫైనల్స్ చేరుకున్న బాల బాలికలకు మెడల్, సర్టిఫికేట్, జానిమాజ్, ఖుర్ఆన్ మజీదు బహుమానంగా ఇవ్వబడతాయి. ఫిబ్రవరి 11, 2024వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతుంది.

**వేదిక :** ది ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ హాల్, ఆటోనగర్, విజయవాడ

**తేదీ :** 11-2-2024 ఆదివారం 9 గంటలకు

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**